

నేత్రపర్వం సీతారామ కల్యాణం

● ముగిసిన త్యాగరాజ స్మరణోత్సవాలు


నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో 60వ త్యాగరాజ స్మరణోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం సీతారామలక్ష్మణ హనుమ త్యాగరాజ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కళాకారులు త్యాగరాజ సంకీర్తనలు సుమధురంగా గానం చేశారు. సాయంత్రం సం గీత కచేరీల అనంతరం సీతారాములు, కమ లాంబిక త్యాగరా జేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. త్యాగరాజస్వామికి వైభవంగా పుష్పాభి షేకం చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (గురువారం సాయంత్రం)
సహరి : 4.52 (శుక్రవారం ఉదయం)

షుగర్ ఫ్యాక్టరీ భూములు ఏపీఐఐసీకి..



విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్



నెల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : 'కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నాం. 124 ఎకరాల భూములను ఏపీఐఐసీకి అప్పగించాలని సూచించాం. ఆ భూములను పారిశ్రామిక అభివృద్ధి చేయాలి. అందుకు సంబంధించి ప్రణాళికలు తయారు చేయమని పరిశ్రమల శాఖను ఆదేశించాం. ఈ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికులు, చెరకు రైతులకు చెల్లించాల్సిన రూ.28 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తుంది' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెండో రోజు బుధవారం నెల్లూరు జిల్లా ప్రగతి, ప్రణాళికపై సీఎం సమీక్షించారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ అంశాన్ని తొలుత కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి పొంగూరు నారాయణ కూడా కార్మికుల బకాయిలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు ఈ అంశంపై కీలక నిర్ణయం తీసుకుని ప్రకటన చేశారు. దీంతో కార్మికులకు బకాయిలు అందడంతోపాటు రూ.వందల కోట్ల విలువైన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

● **కలెక్టర్ ప్రజంటేషన్**

జిల్లాపై సమీక్ష సందర్భంగా ముందుగా కలెక్టర్ ఓ ఆనంద్.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను వివరించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు, పరిశ్రమలు, సేవా రంగాల్లో 15 శాతం గ్రోత్ రేటు సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను సీఎంకు తెలియజేశారు. జిల్లాలో 163 కి.మీ సముద్రతీర ప్రాంతం ఉందని, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులతో జిల్లా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మూడు ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు భూసేకరణ పనులు ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కొన్ని కంపెనీలు ముందుకొచ్చినట్లు వివరించారు. బిట్రగుంట వద్ద రైల్వే ప్రాజెక్టు ఏర్పాటుకు 500 ఎకరాల భూసేకరణ చేపడుతున్నట్లు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు రుణాలు అందిస్తున్నామని, ఎస్టీలకు ఆధార్ కార్డులు అందించే ప్రక్రియలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు ఆనంద్ పేర్కొన్నారు. ప్రజలకు తక్కువ ధరల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లను అందించేందుకు నుడా పరిధిలో 200 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆ తర్వాత జోన్ 4 ఇన్‌చార్జ్ అధికారి ఎంటీ కృష్ణబాబు కూడా జిల్లా పరిస్థితులను క్లుప్తంగా వివరించారు.

పారిశ్రామికంగా అభివృద్ధికి చర్యలు
రూ.28 కోట్ల బకాయిలు చెల్లిస్తాం
తమిళనాడు బోట్ల సమస్యనూ పరిష్కరిస్తాం
కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు హామీ

● **కీలక సమస్యలపై సీఎం హామీ**

జిల్లా యాక్షన్ ప్లాన్‌ను వివరించిన అనంతరం కలెక్టర్ జిల్లాలో ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వాటిలో కోవూరు షుగర్ ఫ్యాక్టరీతోపాటు తమిళనాడు బోట్ల చొరబాటు, ఫిషింగ్ హార్బర్‌ను ఆపరేషన్‌లోకి తీసుకురావడం, సోమశిల ఆప్రాన్ పూర్తి చేయడంతోపాటు హైలెవల్ కెనాల్ భూసేకరణకు అవసరమైన నిధులు వంటి అంశాలు ఉన్నాయి. రూ.288 కోట్లతో చేపట్టిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం దాదాపుగా పూర్తయిందని, త్వరగా ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ కోరగా.. దీనిపై స్పందించిన సీఎం వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను ఆదేశించారు. సోమశిల ఆప్రాన్, హైలెవల్ కెనాల్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కలెక్టర్ కోరగా ఇరిగేషన్ అధికారులు తనతో ప్రత్యేకంగా చర్చించి సోమశిల పనులు వేగ వంతం చేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాలో 10,924 ఇళ్ల నిర్మాణాలు విజిలెన్స్ విచారణతో నిలిచి పోయాయని, ఈ ఇళ్ల నిర్మాణాల పూర్తికి అనుమతించాలని కలెక్టర్ కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

● **జిల్లాలో అత్యధిక గ్రోత్‌రేటు**

జోన్ 4లోని జిల్లాల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జోన్ 4లోని నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో అత్యధిక గ్రోత్ రేటు నెల్లూరు జిల్లా సాధించిందని సీఎం చెప్పారు. నెల్లూరు జిల్లా 14.45 శాతం, ప్రకాశం జిల్లా 10.46 శాతం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు 13.22 శాతం, తిరుపతి జిల్లా గ్రోత్ రేటు 12.08 శాతంగా ఉన్నట్లు వెల్లడించారు. రానున్న ఏడాదిలో గ్రోత్ రేటు 15 శాతం దాటే విధంగా కలెక్టర్లు పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇక తలసరి ఆదాయంలో జోన్ 4 పరిధిలో అత్యధికంగా తిరుపతి జిల్లాలో ఉండగా, ఆ తర్వాత స్థానంలో నెల్లూరు ఉందని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను స్పష్టంగా వివరించిన సీఎం.. వాటి అమలుకు జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు చివరి పేదవాడి వరకూ అందాలని, ఆ లక్ష్యంతో పని చేయాలని సీఎం సూచించారు.

పద్దులో గారడీ!

నెల్లూరు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం బుధవారం వాడివేడిగా సాగింది. పద్దులో పేర్కొన్న గణాంకాలు అంకెల గారడీని తలపిస్తున్నాయంటూ వైసీపీ, టీడీపీ సభ్యులు ముక్తకంఠంగా అధికారుల తీరుపై మండిపడ్డారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో చూపిన ఖర్చులన్నీ వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, జరిపిన కేటాయింపులు, పెట్టిన ఖర్చులు కాగితాల్లో తప్ప వాస్తవాలు కాదని తెగేసిచెప్పారు. ఇక కొత్త బడ్జెట్‌లోనూ ఊహలకు రెక్కలు తొడిగారని, పన్ను వసూళ్లకు ప్రాధాన్యమిచ్చి ప్రజాసేవకు పాతరేశారంటూ సభ్యులు ఏకపక్షంగా అభ్యంతరాలు తెలుపుతూనే రూ.695.95 కోట్ల పద్దుకు మేయర్ స్రవంతి అధ్యక్షతను ఆమోదం తెలిపారు. ఈసారి ఒకరి మధ్య మరొకరు వాగ్వివాదాలకు తెరదించిన సభ్యులు అధికారులపైకి దూసుకెళ్లడం గమనార్హం.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

మేయర్ పేషీలో అంత ఖర్చా!?



మేయర్ పేషీలో ముగిసిన బడ్జెట్ పద్దులో రూ.10 లక్షలు కేటాయించి అందులో రూ.8 లక్షలు ఖర్చు చేసినట్లు చూపారు. ఈ మొత్తానికి ఏం ఖర్చు చేశారో చెప్పాలంటూ 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డిరెడ్డి పట్టుపట్టారు. దీనిపై ఎవరి దగ్గర సమాధానం లేదు. రానున్న ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.10 లక్షలు కేటాయించారని పేషీలో రూ.లక్షల్లో ఏం ఖర్చులు ఉంటాయని నిలదీశారు. ఇంతలో జోక్యం చేసుకున్న మేయర్ కనుక్కుని వివరంగా చెప్తానని తెలిపారు. స్టేషనరీకి రూ.40 లక్షలు, జెరాక్స్‌లకు రూ.20 లక్షలు, లీగల్ ఫీజుల పేరిట రూ.25 లక్షలు ఖర్చు అయినట్టు చూపడం వాస్తవాలకు దూరంగా ఉందని, ఇది కేవలం కాగితపు లెక్కలే తప్ప నిజంకాదని సభ్యులు ముక్తకంఠంతో నిలదీశారు. దోమల నివారణ పేరిట ఆయిల్‌బాల్స్, ఫాగింగ్ ఆయిల్స్ పేరిట రూ. 45 ఖర్చు చేసినట్లు పద్దులో పేర్కొనడంపైనా అభ్యంతరం తెలిపారు. డివిజన్లలో తమకు తెలియకుండా ఇంత నగదు ఎక్కడ ఖర్చు అయిందని అధికారులను సూటిగా ప్రశ్నించారు. కంటికి కనపడని ట్రాఫిక్ సిగ్నల్స్‌కు రూ.70 లక్షలు ఖర్చు చేయడంపైనా టీడీపీ, వైసీపీ సభ్యులు మండిపడ్డారు. అలాగే నగరంలో జంతువుల నియంత్రణకు రూ.15 లక్షలు, కుక్కలకు శస్త్రచికిత్సలకు రూ.80 లక్షలు ఖర్చు చేయడంపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

● వాస్తవాలకు దూరంగా గత బడ్జెట్ ఖర్చులు
● కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్‌కు రూ.70 లక్షల వ్యయమా!?
● ఊహలకు అందని రీతిలో కొత్త బడ్జెట్
● పన్నులకే ప్రాధాన్యమిస్తారా.. ప్రజాసేవను పట్టించుకోరా!?
● అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం
● రూ. 695.95 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్‌లో ఉన్న రూ.121.30 కోట్ల నిల్వ నిధితో రూ.585.48 కోట్లు అదనంగా ఆదాయం సమకూరు తుందని, మొత్తం రూ.706.78 కోట్లకుగాను 695.95 కోట్లను నగరాభి వృద్ధికి ఖర్చు చేయనున్నట్లు మేయర్ స్రవంతి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో 54 డివి జన్ల ప్రణాళిక ప్రకారం రూ.448.52 కోట్లు, ప్రణాళికేతరంగా మరో రూ.247.43 కోట్లను ఖర్చు చేసేందుకు ఖజానాను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. పన్నుల రూపేణా ఈసారి రూ.122.52 కోట్లు రాబట్టాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు మేయర్ తెలపడంతో కౌన్సిల్లోని సభ్యులు అభ్యంతరం తెలిపారు. గతేడాది రూ.79.77 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం కాగ ఈసారి రూ.122.52 కోట్లకు పెంచడమంటే ప్రజలపై భారం వేయడమేనని ఇందుకు తామంతా వ్యతిరేకమని చెప్పారు. వాణిజ్య రంగంలో చిన్న తరహా వారికి పన్నుల్లో మినహాయింపు ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ మేరకు మేయర్, కమిషనర్ నుంచి హామీ రావడంతో సభ్యులు శాంతించారు. మూడేళ్ల నుంచి అమలులో లేని బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌ల ద్వారా రూ.15 కోట్ల ఆదాయం ఎలా వస్తుందని సభ్యులు ప్రశ్నించారు. కౌన్సిల్ ఏర్పడి మూడున్నరేళ్ల పూర్తయినా ఇప్పటివరకు కార్పొరేటర్లకు శిక్షణ, స్టడీ టూర్ వేయకపోవడం, తాజాగా బడ్జెట్‌లో రూ.25 లక్షలు కేటాయించడం హాస్యాస్పదంగా ఉందని కొందరు కార్పొరేటర్లు విమర్శించారు.

ఎన్నికలకు కార్పొరేషన్ డబ్బా!?

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కార్పొరేషన్‌కు చెందిన సాధారణ నిధుల నుంచి రూ.3 కోట్లు ఎందుకు ఖర్చు చేయాల్సి వచ్చిందని సభ్యులు ప్రశ్నించారు. ఆ ఎన్నికల ఖర్చును రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వస్తాయి కాబట్టి కార్పొరేషన్ నిధులు ఎలా ఖర్చు చేశారంటూ సభ్యులు నిలదీశారు. దీనిపై విచారణ జరిపించాలని పట్టుపట్టారు. ఇది చాలదన్నట్టు రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ మరో రూ.1.5 కోట్లు కేటాయించడమేమిటని అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ సూర్యతేజ ఎన్నికలకు ఖర్చు చేసిన రూ.3 కోట్లు ఎన్నికల సంఘం నుంచి రావాల్సి ఉందని, ఈ మేరకు కలెక్టర్‌కు తెలియజేసినట్లు వివరణ ఇచ్చారు.

విమర్శించారు. ప్రజలకు అంకెల గారడికాకుండా వాస్తవాలు తెలియచేయాలని కిన్నెర మాల్యాద్రి సూచించారు. పన్నుల భారం తప్ప ప్రజాసేవ బడ్జెట్‌లో కనిపించడంలేదని మొయిళ్ల గౌరి విమర్శించారు. నగరంలో పన్ను వసూళ్ల డిమాండ్ నోటీసులు ఇవ్వడం లేదని, దీనివల్ల సకాలంలో చెల్లింపులు చేయలేకున్నారంటూ పోట్లూరి రామకృష్ణ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ప్లాస్టిక్ నివారణకు దాడులు తప్ప ప్రజల్లో అవగాహన లేదని మరో సభ్యుడు రవిచంద్ర సూచించారు.

ఎవరిదారి వాళ్లదే!



నెల్లూరులో 8 లక్షల మంది జనాభాకు సంబంధించి రూ.695.95 కోట్లతో బడ్జెట్ సమావేశం జరుగుతుంటే కొంతమంది కార్పొరేటర్లు తమకేమీ సంబంధం లేదనట్టుగా వ్యవహరించడం గమనార్హం. ఇందులో అధ్యక్షత వహించిన మేయర్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండగా, మరికొందరు మహిళా కార్పొరేటర్లు సైతం తమ సెల్ ఫోన్లలో రీల్స్ చూసు కుంటూ ఉండిపోయారు. ఇంకొందరు ఫోన్లలో గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేశారు.

● **అధికారుల తీరుపై గరంగరం**

2025-26 కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌పై అధికారులు చూపిన గణాంకాల పై సభ్యులు అభ్యంతరాలు తెలిపారు. వాస్తవాలకు దూరంగా అంకెలతో గారడి చేశారంటూ అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏకపక్షంగా ఎండగట్టారు. ఆదాయం ఉన్నట్లు బడ్జెట్‌లో చూపిన అధికారులు కాంట్రాక్టర్లకు ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని బొబ్బల శ్రీనివాసులు ప్రశ్నించారు. అధికారులకు కమీషన్లు వచ్చే అంశాలకే కేటాయింపులు ఎక్కువగా జరుపుతున్నారంటూ, నగరంలో మంచినీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని, ఇంజనీర్లు మాత్రం ఏసీ గదుల్లోనుంచి బయటకు రావడం లేదని మరో సభ్యుడు కర్తం దుయ్యపట్టారు. కార్పొరేషన్ ఖజానాకు వచ్చే ఆదాయం కంటే రెవెన్యూ, సిటీప్లానింగ్ అధికారుల జేబుల్లోకి వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉందని మరో కార్పొరేటర్ గోతం అరుణ

ప్రభుత్వ కార్యక్రమాల్లో మైనార్టీల వాటా తగ్గనివ్వొద్దు

● డీఆర్వో ఉదయభాస్కర్ రావు

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీల వాటా 15 శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయభాస్కర్‌రావు అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీల భాగస్వామ్యంపై త్రైమాసిక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల రేషనలైజే షన్ ప్రక్రియ కొనసాగుతున్నందున, మైనార్టీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో అవసరమైన చోట ప్రత్యేక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. స్వయం ఉపాధి కోర్సుల్లో మైనార్టీలకు శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ హైఫా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష ఏపీవో వెంకటసుబ్బయ్య, మెప్మా పీడీ రాధమ్మ, మైనార్టీ వ్యవహారాల ఎన్జీవో అహ్మద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

● **రేపు ఇఫ్తార్ విందు**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందుఇస్తున్నట్లు మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపారు.

ఉదయగిరిలో తమ్ముళ్ల బాహాబాహీ

ఉదయగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు బాహాబాహీకి దిగారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో భవన మరమ్మతుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వచ్చారు. శిలాఫలకం వద్ద నిలబడే క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో ఎమ్మెల్యే, పోలీసులు కలగజేసుకొని వివాదాన్ని సద్దుమణిచారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యే వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఈ తరుణంలో అదే ఘటనపై మరలా ఎస్సీ సెల్ నాయకుడు నల్లిపోగు రాజా, టీడీపీ నాయకుడు మట్ల లక్ష్మయ్యల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొని తోపులాటకు దారి తీసింది. ఒకానొకదశలో చేయి చేసుకున్నారు. అక్కడే ఉన్న టీడీపీ నాయ కులు, పోలీసులు వివాదాన్ని అంతా సర్దుబాటు చేశారు. అనం తరం అతిథి గృహం నుంచి బయటకు వచ్చి న ఎమ్మెల్యే వారితో మాట్లాడి సర్దిచెప్పి అక్కడి నుంచి దాసరి పల్లి వెళ్లిపోయా రు. కాగా మట్ల లక్ష్మయ్య తనపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమాయకుల నోళ్లు కొట్టారు!

● రాపూరులో యానాదుల నిధులు స్వాహా
● రుణాలు ఇవ్వకనే ఇచ్చినట్లు అవకతవకలు
● మృతులకూ లోన్లు ఇచ్చారట!
● 14 సంఘాలకు సంబంధించి రూ.71 లక్షలు పక్కదారి
● అడిగేవారు లేక ఇన్నాళ్లూ బయటకురాని వ్యవహారం
● వెలుగులోకి వస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది బాగోతాలు

ఇలాంటి అనేక సిత్రాలు రాపూరు మండలంలో కనిపిస్తున్నాయి. గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ తీసుకొస్తే దానిని కొందరు వెలుగు సిబ్బంది కల్పతరువుగా మార్చుకున్నారు. అమాయక యానాదుల పొట్టకొడుతూ వారికి దక్కాల్సిన రుణాలను దిగమింగారు. చాలా కాలం నుంచి ఈ దందా జరుగుతున్నా అడిగేవారు లేకపోవడంతో బయటకు పొక్కలేదు. తాజాగా కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఆర్‌డీఏ సిబ్బంది బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండల స్థాయి ఉద్యోగులు దోచుకున్న దానిలో జిల్లాస్థాయి అధికారులకు కూడా వాటాలు ఇవ్వడంతో వస్తున్న ఫిర్యాదులను పట్టించుకునేవారు కాదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క రాపూరు యానాది మండల సమాఖ్య పరిధిలో 14 యానాది గ్రామ సంఘాలు(వీవో) ఉన్నాయి. వాటి పరిధిలో పదుల సంఖ్యలో యానాది మహిళల పొదుపు గ్రూపులు ఉండగా వీరికి దక్కాల్సిన నిధులు భారీగా పక్కదారి పట్టాయి. యానాది పొదుపు మహిళల కోసం రూ.2.47 కోట్ల నిధులు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరు కాగా అందులో వాస్తవంగా సభ్యులకు రూ.1.76 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారు. మిగిలిన రూ.71 లక్షలను వెలుగు సిబ్బంది పక్కదారి పట్టించారు. ఈ విషయం తాజా విచారణలో బయటపడినట్లు తెలిసింది. రికార్డుల్లో మాత్రం రుణాలు ఇచ్చినట్లు చూపి స్తున్నారు. అయితే స్థానిక వీవోఏ, సీసీ, ఏపీఎంలే ఈ రికార్డులన్నిం టినీ మెయింటెన్ చేస్తుండటం, కనీసం ఎంత మేర రుణం మంజూరైందన్న విషయం కూడా యానాది మహిళలకు చెప్పడం లేదు. వీరిలో చాలా మంది నిరక్షరాస్యులు కావడంతో దీనిని అక్రమార్కులు అవకాశంగా మలుచుకున్నారు. ఆఖరుకు చనిపోయిన మహిళల పేరిట కూడా రుణాలు ఇచ్చినట్లు రాసి ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కొన్ని సంఘాలకు సగం నిధులు అందించగా, మరికొన్ని సంఘాలకైతే ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

గోనుపల్లి యానాది గ్రామ సంఘంలోని ఓ పొదుపు సంఘానికి రూ.4 లక్షలు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రుణం మంజూరైంది. అయితే ఒక్క రూపాయి కూడా ఆ సంఘంలోని పొదుపు మహిళలకు అందలేదు. అయితే, వెలుగు సిబ్బంది మాత్రం పుస్తకాల్లో రుణం ఇచ్చినట్లు చూపిస్తున్నారు. ఈ సంఘంలోని ఓ మహిళ 2014లోనే చనిపోతే 2018లో రుణం తీసుకున్నట్లు రికార్డులో చూపిస్తుం డటం గమనార్హం.

తెగచర్ల యానాది సంఘంలోని మరో పొదుపు గ్రూపునకు రూ.4.10 లక్షలు ఎస్టీ సబ్ ప్లాన్ కింద రుణం మంజూరైంది. అయితే ఈ గ్రూపులోని పది మందికి ఒక్కొక్కరికి రూ.21 వేల చొప్పున రూ.2.1 లక్షలు మాత్రమే రుణం ఇచ్చారు. మిగిలిన రూ.2 లక్షలను వెలుగుసిబ్బంది స్వాహా చేశారు. కానీ పుస్తకంలో మాత్రం రూ.4.1 లక్షల రుణం ఇచ్చినట్లు నమోదు చేశారు. ఈ గ్రూపులోని ఓ సభ్యురాలు 2016లో చనిపోతే 2018లో ఆమె రుణం తీసుకున్నట్లు చూపించడం గమనార్హం.

వడ్డీ కూడా వసూలు



ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఇచ్చే రుణాలకు వడ్డీ ఉండదు. కానీ గత ప్రభుత్వంలో యానాది సంఘాల నుంచి వడ్డీలు కూడా వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఇది తీవ్ర నేరంగా అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇలా వసూలు చేసిన వడ్డీలను స్థానిక వీవోఏలకు గౌరవ వేతనంగా చెల్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వివరణ ఇస్తున్నారు. మరి వాస్తవంగా ప్రాజెక్టు నుంచి వీవోఏలకు ఇవ్వాల్సిన నెలకు రూ.8వేల గౌరవ వేతనం ఏమైందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ నిధులను స్వాహా చేసి, ఆ స్థానంలో గిరిజనుల నుంచి వడ్డీలు వసూలు చేసి గౌరవ వేతనాలు చెల్లించారా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాపూరు మండలంలో కొందరు సీసీలు, ఏపీఎంలు ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేయడంతోనే ఈ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు చెప్పుకుంటున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఉన్నతాధికారులు ఈ విషయాలన్నీ తెలిసినా పట్టించుకోకపోగా, ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సహకారమందించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క రాపూరు మండలంలోనే యానాదులకు దక్కాల్సిన నిధులు ఇంత భారీ స్థాయిలో పక్కదారి పడితే.. మరి మిగిలిన మండలాల్లో పరిస్థితేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. జిల్లాలో రాపూరుతో పాటు ఉదయగిరి, సైదాపురం మండలాల్లో యానాది సమాఖ్యలు ఉన్నాయి. రాపూరు సమాఖ్య కింద 14 గ్రామ సంఘాలు, సైదాపురం సమాఖ్య కింద 12 గ్రామ సంఘాలు, ఉదయగిరి సమాఖ్య కింద మూడు గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటన్నింటి కింద సుమారు 230 పొదుపు గ్రూపులు ఉన్నాయి. మరి వీటిలోని సభ్యులకు ప్రభుత్వం నుంచి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా అందాయా? లేదా? అన్నది కూడా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

30న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొలగానిసత్రంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 30వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8462
వెండి కిలో ధర	రూ. 1,01,500
వెండి ఒక గ్రాము	రూ.104.50

న్యూస్ బాక్స్

క్యాలెండర్ల పంపిణీ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రూపొందించిన క్యాలెండర్ల ఆవిష్కరణ జరిగింది. అనంతరం తహసీల్దారు వై నాగరాజు, ఎంపీడీవో మల్లికార్జున్‌లకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, పెంచలరత్నం, వెంకటేశ్వర్లు, మాలకొండారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

29న ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిమలూరులో ఈనెల 29వ తేదీన వెంకటేశ్వర మహిమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్‌పర్సన్ గుండ్రా పద్మావతి, కార్యనిర్వాహకులు మహిమలూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అపోలో ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేస్తారని, రోగులకు భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుత్తలూరు మండల బీజేపీ కమిటీ ఎంపిక

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ నూతన కమిటీని మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల ఉపాధ్యక్షుడిగా పెసల కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా అందే రామయ్య, తిపిరిబోయిన వెంకటేశ్వర్లును ఎంపిక చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషిచేయాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో పావ ని సూచించారు. బుధవారం తమ కార్యాలయంలో మానిటరింగ్ కమిటీ సమావేశం ని ర్వహించారు. ఈ కార్య క్రమానికి డీఎస్పీ వేణుగోపాల్ హాజరై ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి వివరించారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం ఎస్సీ, ఎస్టీలకు అందేలా చూడాలని, వారి జీవనోపాధి మెరుగుకు ఉద్యోగుల సహకారం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎం ఆర్వోలు, ఎంపీడీవోలు, ఎస్ఐలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమశిలలో 53.997 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 53.997 టీఎంసీలు నిల్వఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూ సెక్కులు సరఫరా చేస్తున్నారు.

వర్మీ కంపోస్టు తయారీకి వానపాముల విడుదల



వానపాములు వదులుతున్న సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి

సంగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో (ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో బుధవారం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వానపాములను వదిలారు. గ్రామంలో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం తొట్టెలో కుళ్లబెట్టి అందులో వానపాములను వదిలారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం లేని బోర్డులెందుకు ?

● అలంకారప్రాయంగా దర్శనం ● అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



తిరుమలాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన బోర్డు

ఉదయగిరి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమగ్ర సమాచారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శాఖల వారీగా సమాచార బోర్డులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అలంకారప్రాయంగా దర్శనమిస్తుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గండిపాళెం జలాశయం కుడి కాలువకు సంబంధించి ప్రధాన రహదారిలో ఇరిగేషన్ శాఖ ఏర్పాటుచేసిన సమాచార బోర్డు ఏపుగా పెరిగిన చిల్లచెట్ల నడుమ చిక్కుకొని ఎలాంటి వివరాలు లేకుండా వెక్కిరిస్తోంది. అలాగే సున్నంవారిచింతల నుంచి తిరుమలాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డులో ఎలాంటి సమాచారం లేకుండా కూలిపోయే స్థితిలో ఉంది. దీంతో అటుగా వెళ్లిన ప్రజలు బోర్డుల వైపు చూసి కనీస సమాచారం తెలుసుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు శాఖల పరంగా సమగ్ర సమాచారం అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

‘ఉపాధి’లో అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతిని నిర్మూలించడంతోపాటు ప్రజలకు ఉపయోగపడే పనులు చేసేలా చర్యలు చేపట్టడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27 లక్షలతో ఎంపీడీవో కార్యాలయ భవన మరమ్మతు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కా గృహాలు, మంజూరు చేయాలన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఉద యగిరి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఉదయగిరి దుర్గం, ఘటికసిద్ధేశ్వరం క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడు తున్నామన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, మట్ల శాంతి, తహసీల్దారు సుభద్ర, ఎంపీడీవో అప్పాజీ, నాయకులు మూలె వినయ్‌రెడ్డి, కలివెల జ్యోతి, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళకళలాడిన సమావేశ మందిరం

కాగా, మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కాకర్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలతోపాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశ మందిరం కిక్కిరిసింది. ఎప్పుడూ హాజరుకాని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావడంతో ఎమ్మెల్యే సారొచ్చాడు కదా.. అందుకని వీరంతా హాజరయ్యారంటూ పలువురు గుసగుసలాడుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

సీతారామపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంగారిపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ ముత్తుకూరు వెంకటసుబ్బయ్య మామ మల్లెబోయిన తిరుమలయ్య బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పోలంగారిపల్లి గ్రామానికి వచ్చి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలోని ప్రజలు వారి సమస్యలను తెలుపగా వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

దాసరిపల్లిలో ఇఫ్తార్ విందు

ఉదయగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లిలో బుధవారం రాత్రి మాజీ సర్పంచ్ సయ్యద్ జమ్మత్‌జాఫర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో హిందూ, ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచల బాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు సందానీ, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

● సంగం : రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక మసీదులో టీడీపీ మండల పార్టీ కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులతోపాటు టీడీపీ నాయకులు బాబు, జండాదిబ్బ మైనార్టీ నాయకులు ఫయాజ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ మృతికి సంతాపం

అనంతసాగరం, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి) మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న బెడుసుపల్లికి చెందిన శేషయ్య (52) బుధవారం మృతి చెందాడు. దీంతో తోటి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మరమ్మతులకు నోచని మినరల్ వాటర్ ప్లాంట్

● తాగునీటి కోసం గ్రామస్థుల అవస్థలు



మరమ్మతులకు గురై మూత పడిన మినరల్ వాటర్ ప్లాంట్

సంగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్లలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై మూత పడడంతో తాగునీటి కోసం గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఎంపీ గ్రాంట్‌తో నిర్మించిన వాటర్ ప్లాంట్‌లో 20 లీటర్ల క్యాన్ రూ. 5కే అందచేసేవారు. మూడు నెలల కిందట మరమ్మతులకు గురైనా నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్ వాహనం వద్ద క్యాన్ వాటర్ రూ. 15కు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్‌ను బాగుచేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆ మలుపులో జరభద్రం..



ప్రమాదకరంగా మారిన మలుపు

ఉదయగిరి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయానికి వెళ్లే రహదారి సమీపంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయగిరికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఆ లింకురోడ్డు ప్రాంతంలోనే మలుపు ఉండడం, రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడం, ఒక్కసారిగా వాహనాలు ఎదురుపడినప్పుడు అదుపు చేయలేక ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాపోతున్నారు. అంతేగాక ఆ గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో మోటారుబైకులు, ఆటోలు అధిక సంఖ్యలో పరుగులు తీస్తుంటాయి. దీంతో ఏక్షణంలో ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందేమోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన మలుపు వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ బృందం విచారణ



జడదేవిలో పనులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను బుధవారం ఎస్ఆర్పీ నీలకంఠ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం విచారణ చేపట్టింది. రూ. 11.76 కోట్ల వ్యయంతో చేపట్టిన 317 పనులను 12 మంది డీఆర్పీల బృందం పరిశీలించి కూలీలను సమగ్రంగా విచారించడం జరుగు తుందన్నారు. ఈ నెల 31 వరకు గ్రామాల్లో జరిగే విచారణకు ఉపాధి సిబ్బంది, కూలీలు తమ వంతుగా సహకరించాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్య వైఖరి అవలంబించకుండా నిబంధనల మేరకు సమర్థవంతంగా విచారణ కొనసాగించాలని బృందం సభ్యులకు సైతం ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీ లు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రైతులందరికీ విశిష్ట సంఖ్య తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రవికుమార్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కలిగిన రైతులందరూ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేస్తున్న విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా కలిగి ఉండాలని వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. బుధవారం రామాపురంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విశిష్ట సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, రాయితీపై పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. వలస వెళ్లిన రైతులు సైతం తమ పరిధిలోని భూములకు సంబంధించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఈనెల 31లోపు అన్ని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఈఈ మోహన్‌రావు

సంగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లబ్ధిదారులు ప్రభుత్వం అందచేసే అదనపు సాయం సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ ఈఈ మోహన్‌రావు లబ్ధిదారులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అర్థాంతరంగా ఆగిన గృహాలపై ఆరా తీశారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనపు సాయం కింద రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అందచేస్తుందన్నారు. లబ్ధిదారులను చైతన్యపరచి వెంటనే నిర్మాణాలను ప్రారంభించి మే నెలాఖరుకు ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకునేలా చూడాలని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇన్‌చార్జి డీఈ గౌస్ మొహిద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఉదయగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ చినవెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుర్గంపల్లి గ్రామంలో అడవుల సంరక్షణపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అడవులను అగ్నికి ఆహుతి చేయడం, వన్యప్రాణులను వేటాడం, ఎర్ర చందనం చెట్లను నరకడం చట్టరీత్యా నేరమని కళాజాత బృందం గ్రామస్థులకు నృత్య రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, వీఎస్ఎస్ చైర్మన్ సింగనబోయిన బాల చెన్నయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

క్వారీ గుంతలో ఈతకు వెళ్లి
యువకుడి గల్లంతు



ఏలూరు పెంచలప్రసాద్ (ఫైల్)

కలువాయి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలసి కాలనీ సమీపంలోని కంకర క్వారీలో ఈతకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం కలువాయి మండలం కేశమనేనిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గిరిజన కాలనీకి చెందిన ఏలూరు పెంచలప్రసాద్ (18) స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. పాఠశాలకు ఒంటిపూట బడులు కావ డంతో మధ్యాహ్నానికి విధులు ముగిం చుకుని ఇంటికి చేరాడు. స్నేహితులందరూ ఈతకు వెళ్లారని తెలుసుకుని పెంచలప్రసాద్ కూడా క్వారీ గుంతలో ఈతకు దిగాడు. కొంతదూరం ఈత కొట్టి మునిగిపోతూ కేకలు వేశాడు. గమనించిన స్నేహితులు అతడిని కాపాడే ప్రయత్నం చేశారు. వీలుకాకపోవడంతో వారు కాలనీ వాసులకు తెలిపారు. గల్లంతైన యువకుడి కోసం రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా దొరకలేదు.

చికిత్స పొందుతూ
గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని రంగనాయకుల పేట రైలు వీధిలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (40) మద్యం సేవించి రహదారిపై అపస్మారక స్థితిలో పడి పోయాడు. స్థానికులు 52వ డివిజన్ రెవెన్యూ సెక్రటరీ నరేంద్రబాబుకు సమాచారమిచ్చారు. ఆయన 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరేంద్రబాబు ఫిర్యాదుతో సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ కోసం పోలీసులు విచారిస్తున్నారు.

స్కూటర్, ఆటో ఢీకొని
నలుగురికి తీవ్ర గాయాలు



గాయపడ్డ బాలకృష్ణ

నెల్లూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నెలూరు - తాటిపర్తి రహదారిపై వెల్లంటి వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు కాలనీకి చెందిన మేకల బాలకృష్ణ తన అత్తగారి ఊరైన తాటిపర్తికి స్కూటర్‌పై కుమార్తె వెన్నె ల, కుమారుడు అంకిత్, బావ బూదూరు శీనయ్యతో బయల్దేరాడు. కందమూరు మలుపు తిరిగాక వెల్లంటి నెరేళ్ల చెరువు సమీపాన వెల్లంటి గ్రామానికి చెందిన వ్యక్తి ఆటో అతివేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. దీంతో వీరంతా చెల్లాచెదురుగా పడిపోయారు. స్కూటర్‌పై వస్తున్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన సౌత్‌మోపూరు పీహెచ్‌సీ కి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనలో ఆటో అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

రోడ్డు పక్కన అస్థిపంజరం గుర్తింపు

ఆత్మకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి మున్సిపాల్టీ పరిధిలో అల్లీపురం క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరాన్ని బుధవారం గుర్తించినట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు. సుమారు 58 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహం ఆనవాళ్లు ఎవరైనా గుర్తించినట్లయితే స్థానిక పోలీసులకు 9440796390 నెంబరుకు ఫోన్‌చేసి వివరాలు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

మహిళ మృతిపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచేడు గ్రామంలో వరికోతకు వెళ్లిన నాగూరు ప్రమీల (46) ట్రాక్టర్ కింద పడి మృతిచెందడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోష్‌రెడ్డి బుధవారం తెలిపారు. మంగళవారం ఈ ఘటన జరగ్గా బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు. పంచేడు దళితవాడలో అంత్యక్రియలు ముగిశాయి.

రైల్వే సీఐగా సుధాకర్



నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రైల్వే సీఐగా ఏ సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుధా కర్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు, వాకాడు, దగదర్తి, దుత్తలూరు, వేదాయ పాలెం పోలీసు స్టేషన్లలో ఎస్ఐగా పనిచేశారు. 2020లో సీఐగా ఉద్యోగో న్నతి పొంది కావలి, తెనాలి, సీఐడీ, నెల్లూరు ఎస్సీఎస్టీ సెల్‌లో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రయ్ మంటూ డివైడర్ పైకి..



డివైడర్ రాళ్లపైకి ఎక్కిన కారును దించేందుకు శ్రమిస్తున్న యువకులు

నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద కూరగాయల మార్కెట్‌కు వెళ్లే వైపు మంగళవారం అర్ధరాత్రి ఓ కారు వేగంగా వెళుతూ డివైడర్ రాళ్లపైకి ఎక్కేసింది. దీనిని చూసిన స్థానికులు అర్ధరాత్రి సినిమా షూటింగా లేక రీల్స్ చేస్తున్నారా అంటూ కేకలేశారు. అసలు విషయం ఏమిటంటే... అతివేగంగా వెళుతున్న ఆ కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ రాళ్లపైకి ఎక్కేసింది. ఆ వాహ నాన్ని కిందకు దించేందుకు కొందరు యువకులు ఎంత శ్రమించినా ఫలితం లేకపోవడంతో ఆ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి.

ఆంధ్రజ్యోతి
కావలి
కందుకూరు
గురువారం, 27 మార్చి 2025
7
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	228
కోడిగుడ్ల ధర (100): 397	



కాలువలో పడేసిన హుండీ

రెండు ఆలయాల్లో చోరీ

బిట్రగుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని రెండు ఆలయాల్లో బుధవారం చోరీ జరిగింది. గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో హుండీని అపహరించి అందులోని నగదు తీసుకుని కొంత దూరంలోని కాలువలో పారవేశారు. ఇత్తడి దీపపు కుందేలు, పూజా సామగ్రిని అపహరించుకెళ్లారు. అలాగే కొత్తూరు గ్రామ శివారులోని నాగవరపమ్మ ఆలయంలో కూడా చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. అమ్మవారికి సంబంధించిన వెండి పాత్రలు, పట్టుచీరలు, పూజాసామగ్రిని ఎత్తుకు పోయారని తెలిపారు. ఈ చోరీలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై భ్యోజ తెలిపారు.

న్యూస్ బాక్స్

రేపు మాలకొండలో హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొండపైన కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదితో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న సందర్భంగా ఆలయంలోని 28 హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించనున్నట్లు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

అల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించకుంటే అదనంగా 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ఆస్తి పన్నులు రెండు దఫాలుగా చెల్లించాల్సి ఉంటుందని, మొదటి దశలో జూన్ నెలాఖరులోగా రెండో దశలో డిసెంబరు నెలాఖరులోగా చెల్లించాలని పేర్కొన్నారు. అలా చెల్లించకుండా కాలయాపన చేస్తే 2 శాతం అదనపు రుసుముతో చెల్లించాలని పేర్కొన్నారు. బకాయి దారులు ఒకేదఫా ఈనెల 31లోపు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

అల్లూరు, మార్చి 26 : మండలంలోని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేసి స్మార్ట్ మీటర్ల బిగింపును నిలిపివేయాలన్నారు. పెద్దల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములు లబ్ధిదారులకు అందజేసి పట్టా మంజూరు చేయాలని, నగర పంచాయతీ, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, గోపసాని రమేష్, షేక్ కాలేషా, లక్ష్మయ్య, నేతగాని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

67వ సారి 'కండ్లగుంట' రక్తదానం



రక్తదానం చేస్తున్న మధుబాబు

కావలిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో 67వ సారి రక్తదానం చేసి రక్తదాన ఉద్యమానికే స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఆయన మట్లాడుతూ రక్తదానం చేయండి.. మరొకరి ప్రాణం కాపాడండి అన్న రెడ్‌క్రాస్ నినాదంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రధానంగా యువతలో సామాజిక చైతన్యం నింపాలన్న సంకల్పంతో తరచూ రక్తదానం చేస్తున్నానన్నారు. రెడ్‌క్రాస్ బాధ్యులు, పలువురు మధుబాబును అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

లింగసముద్రం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామ శివారులో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం.నారాయణ, సిబ్బందితో కలసి దాడి చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,03,950లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్నివాల్ హంగామా

బిట్రగుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కార్నివాల్ పేరుతో విద్యార్థులు హంగామా చేశారు. కళాశాల ఆవరణలో వివిధ రకాల షాపులు, వినోదాన్ని పంచే ఆటలతో హోరెత్తిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, కార్నివాల్ సమన్వయకర్త వీ.సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వేధింపులు తగదు

● మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, ఈ వేధింపులు ఆపకపోతే పోరాటాలు చేయాల్సి వస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లాడి గోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేసి ఇన్‌స్పెక్టర్ల వేధింపులకు గురైన కార్మికులు వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అల్లాడి గోపాల్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను వేధించడంపై ప్రశ్నిస్తే వారిపై పనిభారం పెంచుతున్నారన్నారు. పుష్‌కాట్‌లను ఇద్దరు చేయాల్సి ఉండగా ఒక మహిళా కార్మికురాలితో చేయిస్తూ ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఇన్‌స్పెక్టర్లు కార్మికుల పట్ల మాట్లాడే భాష బాధాకరంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంచలయ్య, కృష్ణమోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు తురక శీనయ్య, కే.బాబు, ఒంగోలు రమేష్, క్రాంతికుమార్, చిన్నమ్మ, నారాయణమ్మ, జ్యోతి, రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం పైపులైన్ లీక్

● వృథాగా పోతున్న నీరు ● తాగునీటికి అల్లాడుతున్న ఎర్రబాలెంవాసులు



పైపు లైను లీకై పారుతున్న నీరు

కొండాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ ఎర్రబాలెం గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పైపులైను దెబ్బతిని గ్రామానికి నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. సుమారు 18ఏళ్ల క్రితం గ్రామానికి సమీపంలో ఉన్న ఉప్పుటేరు నుంచి దాదాపు 2 కిలోమీటర్లు దూరం సిమెంటు పైపులు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆరు నెలల నుంచి పైపులైను మూడు చోట్లు పగిలిపోయి గ్రామానికి సక్రమంగా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కీముకు ఏర్పాటు చేసిన మోటారుకు స్టార్టర్ లేకపోవడంతో స్థానిక రైతుల మోటార్ల స్టార్టరును బిగించి నీటి సరఫరా చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ క్రమంలో మరోసారి పైపులైను లీక్ అవ్వడంతో గ్రామంలోని 80 కుటుంబాలు నీటి సమస్యతో అల్లాడుతున్నారు. రానున్న వేసవికాలంలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకొని నీటి సమస్యకు ప్రత్యామ్నాయం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీబాషాను వివరణ కోరగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డుపై మురుగు నిల్వ



ఉప్పలపాడులో సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగు

వలేటివారిపాలెం మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువల్లో చెత్తచెదారం పేరుకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరంతా మురుగు నీరు ముదుకు కదల కాలువ పొంగి మురుగంతా సిమెంటు రోడ్డుపైకి చేరి నిల్వ చేరుతోంది. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు ముక్కు మూసుకొని ఆ మురుగు నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పాటు నిల్వ చేరిన మురుగు నీటిలో దోమలు ఉత్పత్తి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. మురుగు కాలువల్లో చెత్తతో పాటు గడ్డి కూడా పెరుగుతోంది. అయినా కాలువలను శుభ్రం చేయించడంపై పంచాయతీ పాలకులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్యం నిర్వాహణకు ప్రభుత్వం లక్షలు ఖర్చు చేస్తున్నా ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. పాలకులు, అదికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

'ఉపాధి' బకాయిలు రూ.80 లక్షలు



పంట కాలువ పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

లింగసముద్రం మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు వెళుతున్న కూలీలకు ఈ ఏడాది జనవరి 9వ తేదీ నుంచి ఇప్పటి వరకు రూ.80 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. 10 వారాలుగా చేసిన పనులకు కూలి డబ్బులు రాకపోవడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. కేవలం ఉపాధి పనులకు మాత్రమే వెళ్లే సుమారు 1500 మందికి డబ్బులు చెల్లించడంలో జాప్యంతో నిత్యావసర సరుకులు, మందులు, ఇతర చిన్న చిన్న ఖర్చులు, కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఏపీవో షేక్ సమీర్‌బాషాను వివరణ కోరగా కూలీలకు రావాల్సిన డబ్బులు వచ్చే నెల మొదటి వారంలో వచ్చే అవకాశం ఉందని, డబ్బులు వచ్చిన వెంటనే కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ప్రతి రోజూ 1500 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారని, వచ్చే నెల 1వ తేదీ నుంచి కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు.

- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)

అడుగడుగునా గుంతలే..!



అధ్వానంగా కొండసముద్రం-ఉప్పలపాడు రోడ్డు

వలేటివారిపాలెం మండలంలోని ఉప్పలపాడు నుంచి కొండసముద్రం వెళ్లే గ్రావెల్ రోడ్డుపై అడుగడుగున మోకాటిలోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతోన్నాయి. ద్విచక్ర వాహనదారులు మోకటిలోతు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు కళవళ్ల, నలదలపూరు, కొండారెడ్డిపాలెం, శాఖవరం, కొండసముద్రం తదితర గ్రామాల ప్రజలు నిత్యం ద్విచక్రవాహనాలలో ఈ మార్గంలోనే రావాలి. వారంతా ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రహదారికి రెండు వైపులా ముళ్లచెట్లు కమ్మేశాయి. అయినప్పటికీ సంబంధిత అదికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రావెల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చించి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కార్యకర్తే అధినేత కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి వారి సమస్యలు పరిష్కరించాలని పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారికి అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశం పార్టీ సొంతమని, ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పదవుల్లోను పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధు, వడ్డెళ్ల రవిచంద్ర, ముచ్చు శ్రీను, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, లక్ష్మీరాజ్యం, శైలజ పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడేవారిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ బిల్డర్ పులి మాల్యాద్రి చిత్రపటానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కౌలు రైతు రక్షణ చట్టం తేవాలి : రైతు సంఘం

కావలిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీల్లో భాగంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం కౌలు రైతు రక్షణ కోసం నూతన కౌలు రైతు చట్టం తేవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బుడమగుంట సచివాలయంలో కౌలు రైతులతో కలిసి వినతిపత్రం అందజేరు. వారు మాట్లాడుతూ రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదని, కోనగోలు కేంద్రాల్లో అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్టర్లలో కూడా కౌలు రైతుల పేర్లు నమేదు చేయడంలేదన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలురైతులకు గుర్తింపు కార్డులు లేకపోయినా పంచనామా రిపోర్టు ఆధారంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టం లేనందున నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రహదారి

● పట్టించుకోని అధికారులు



బ్రిడ్జి సెంటర్‌లో రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలు

కావలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో రోడ్డు ఆర్జిన్లు ఆక్రమణలకు గురవుతున్నా మున్సిపల్, పోలీస్ అధికారులు పట్టించుకోవటం లేదు. బ్రిడ్జి సెంటర్‌లో దక్షిణం వైపు అప్రోచ్ రోడ్డును ఆక్రమణ దారులు పూర్తిగా ఆక్రమించినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఉత్తరం వైపున విశాలంగా ఉన్న అప్రోచ్ రోడ్డులో డ్రైనేజీ దాటి దుకాణదారులు రేకులు వేసుకుని ముందుకువచ్చి ఉన్నారు. ప్రస్తుతం రోడ్డు మీదకు ఆక్రమణదారులు పండ్ల విక్రయానికి చెందిన తోపుడు బండ్లు పెట్టారు. దానిని తొలగించకపోతే మిగిలిన వారందరు తమ దుకాణాల వద్ద మరొకరికి అద్దెకిచ్చి ఇలా రోడ్ల మీద ఆక్రమణలను ప్రోత్సహించే ప్రమాదం ఉంది. దీంతో అక్కడ ద్విచక్ర వాహన దారులు మరీ రోడ్డు మీద పార్కు చేయాల్సి రావటంతో ప్రయాణికులు రోడ్డు మీదనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. దీంతో వంతెనపై వచ్చే వాహనాల నుంచి రోడ్డుపై నిరీక్షించించే ప్రయాణికులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో అక్కడ నిలబడి ఉన్న వ్యక్తులపై వాహనాలు దూసుకు వచ్చి మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. పోలీస్, మున్సిపల్ అధికారులు అక్కడ రోడ్డుపైకి ఆక్రమణలు రాకుండా చర్యలు చేట్టాల్సి ఉంది.

డీఆర్, డీఎం కాలువల అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

బిట్రగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఆర్, డీఎం కాలువల అభివృద్ధి పనులను అడ్డుకోవడం మంచిది కాదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. బోగోలు పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, రైతు నాయకులు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ముంతాల వెంకయ్యలు మాట్లాడుతూ నాలుగు మండలాల రైతులకు ఉపయోగపడే డీఆర్, డీఎం కాలువల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ పాలనలో బీద రవిచంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతో చేసిన పనులకు గత ప్రభుత్వం బిల్లులు చేయకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుత కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కాంట్రాక్టరును ఒప్పించి పనులు చేయిస్తుంటే వాటిని అడ్డుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, కాండ్ర రఘురామ్ నాయుడు, పుట్టా సుబ్బారావు, అనంగి ఆదిశేషయ్య, బోగిరి ప్రభాకర్, మద్దిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు

కందుకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పట్టణంలోని నాంచారమ్మ కాలనీకి చెందిన దాసరి మధుసూదనరావుకు సీఎం సహాయనిధి నుంచి వైద్యఖర్చుల కోసం రూ.7లక్షలు మంజూరైంది. దానికి సంబంధించిన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం బాధితుడి భార్య జ్యోతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అత్తంటి శివకృష్ణ, చిలకపాటి మధు, గుమ్మా శివ, చుండూరి శ్రీను, చుండూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ షాపుల లీజుకు వేలం

కందుకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత లారీస్టాండ్ ఆవరణలో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదులలో ఖాళీగా ఉన్న మూడు షాపులకు ఈనెల 29న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 1వ నెంబరు గది ఎస్సీలకు, 13, 15వ నెంబరు గదులు జనరల్ కేటగిరికి రిజర్వ్ అయి ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

కోడి పందేలపై చర్యలు తీసుకోండి

కావలి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుగానిపాలెం, గౌరవరంలో ప్రతి ఆదివారం జోరుగా సాగుతున్న కోడి పందేల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ పందేలు నిర్వహిస్తుండటంతో యువత కూడా పందేలకు ఆకర్షితులవుతున్నారన్నారు. గ్రామాల్లో వివాదాలు చోటుచేసుకొంటున్నాయని, పోలీసులు నిఘా ఉంచి కోడి పందేల నిర్వాహకులపై చర్యలు చేపట్టాల ని కోరుతున్నారు.

'రాళ్లపాడు'కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

● డ్యాంతోపాటు కార్యాలయాలు పరిశీలించిన ఈఈ మునిరత్నం



ప్రాజెక్టు పాత స్పిల్‌వే హయ్యస్ట్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఈఈ మునిరత్నం

లింగసముద్రం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లు, బ్రిడ్జి రోడ్డు తదితర నిర్వహణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రాజెక్టు నూతన ఈఈ మునిరత్నం అధికారులను ఆదేశించారు. ఒంగోలు ఎన్ఎస్పీలో డీఈగా పనిచేస్తూ పదోన్నతిపై రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈగా నియమితులైన ఆయన బుధవారం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. సబ్ డివిజన్ కార్యాలయాలు, అతిథిగృహం, పాత కొత్త స్పిల్‌వేలలోని గేట్లు, హయ్యస్ట్ బ్రిడ్జిలను, కుడి, ఎడమ కాలువలను పరిశీలించారు. రెండు స్పిల్‌వేల గేట్ల పనితీరును డీఈ ఎం.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది కొరత గురించి ఆరా తీశారు. ప్రాజెక్టుకు నీటి లభ్యతపై తెలుసుకున్నారు. కాగా ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టులో వరి కోతలు దాదాపు పూర్తయ్యాయని, ఈ నెలాఖరుకు నీరు నిలుపుదల చేయాలని ప్రాజెక్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర రావు, కాలువల నీటి సంఘాల అధ్యక్షులు సుబ్బారావు, బుచ్చయ్య చౌదరిలు ఈఈ ముని రత్నంను కోరారు. వచ్చే నెల 15 లోపు పత్తి పైరుకు రెండు విడతల నీరు ఇస్తే సరిపోతుం దని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఈలు నవీన్, మనోహర్‌లు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు, ఆర్టీసీ అధికారులు

కందుకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1973-74 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల బృందం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని విశ్రాంత కంట్రోలర్ అచ్యకాల పద్మారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ నెల్లూరు ఆర్ఎం ఎం.మురళీబాబు, డీఎం ఆర్. శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థుల బృందం మంచిరాజు మురళి, ఎం.ఉమామహేశ్వరరావు, సందానీబాషా, గోనుగుంట సుబ్రహ్మణ్యం, తుమ్మపూడి సుబ్బయ్య, అక్కల ఉమామహేశ్వరరావు, తటవర్తి సత్యం, ఏకాంబరం సత్యనారాయణ, ముష్తాక్ అహ్మద్, చలువాది సత్యం తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

బిట్రగుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేసి ఆయన కుటుంబ సభ్యులకు, క్రైస్తవులకు న్యాయం జరిగేలా చూడాలని బోగోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దారు సురేష్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ శ్యాంసన్‌బాబు, పలు సంఘాల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌కు మెలిక

- రైతులను వెంటాడుతున్న ఇనాం భూముల సమస్య
- రీసర్వేలో అవి పట్టా భూములుగా రూపాంతరం
- గతంలో రిజిస్ట్రేషన్‌కు అర్హత ఉన్నా నేడు ఎందుకీ అభ్యంతరం
- అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం




ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అంగడి మహబూబ్ బాషా. స్వగ్రామం అల్లూరు. ఇతని తల్లి పేరిట బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సర్వేనెంబరు 1018, 1019లలో 5.21 ఎకరాల భూమి ఉంది.ఆయన అవసరం నిమిత్తం కొంత భూమిని ఇతరులకు విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ నిమిత్తం కావలి సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లాడు. ఇది ఇనాం భూమి కావడంతో రిజిస్ట్రేషన్‌కు వీలుకాదని తేల్చిచెప్పాడు. దీంతో అతనికి, కొనుగోలుదారుడికి మధ్య సమస్య ఏర్పడింది. దీంతో అతను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు.

అల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇనాం భూములపై సమస్యలు నేటికీ రైతు లను వెంటాడుతూనే ఉన్నాయి. రీసర్వేతో వెబ్‌ల్యాండ్‌లో వాటికి మోక్షం కలిగి, పట్టా భూములుగా చలామణి అయ్యే సమయం వచ్చిందని రైతులంతా సంబరప డ్డారు. అయితే మేజర్ పంచాయతీలు, పట్టణాల్లో రీసర్వేను నిలుపుదల చేయడంతో ఇనాం భూముల సమస్య అలానే ఉంది.దీంతో రైతులు తమ భూములను విక్రయించుకునేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లిన సమయంలో అధికారులు మోకాలడ్డుతున్నారు. తమకు ఉత్తర్వులు ఉన్నాయని, వాటిననుసరించి రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని వారు తేల్చి చెప్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 45 వేల ఎకరాలకుపైగా ఇనాం భూములు ఉండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

● రీసర్వేతో విముక్తి జరిగిందనుకుంటే..

ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఇనాం భూములకు విముక్తి లభించింది. రీసర్వే ద్వారా మార్పు పొంది పట్టా భూములుగా రూపాంతరం చెందిన ఇనాం భూములను స్వేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇవే భూములను గతంలో రిజిస్ట్రేషన్‌కు అనుమంతించకపోయినా, రీసర్వే అనంతరం అనుమతించాల్సి వస్తోంది. రీసర్వే జరగని గ్రామా ల్లోని ఇనాం భూములు రిజిస్ట్రేషన్‌కు ఎందుకు నోచుకోవడంలేదు.



వెబ్‌ల్యాండ్‌లో భూమి స్వభావం 'ఇనాం' అని ఉన్న అడంగల్ కాపీ

● కోర్టుల్లో కేసులు

ఇనాం భూములను పట్టా భూములుగా పరిగణించాలంటూ పలువురు రైతులు కోర్టుల్లో కేసులు వేశారు. వాదనలు కూడా జరిగాయి. అయినా ఇనాం భూములను రికార్డుల్లో ఉన్న కాలమ్‌లోని ఇనాం పదాన్ని తొలగించేందుకు సాహసం చేసేవారు లేకపోవడంతో ఆ సమస్య నేటికీ రైతులను వెంటాడుతోంది.

● రిజిస్ట్రేషన్ చేయాల్సిందే..

వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఇనాం భూమి అని ఉన్నా, కోర్టులు, ప్రభుత్వాలు వాటిని పట్టా భూములుగానే పరిగణించమని ఆదేశాలు ఇచ్చాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. నిషేధిత జాబితాలో లేవు కాబట్టి వాటిని రిజిస్ట్రేషన్ చేయాల్సిందేనని వారు అంటున్నారు. అయినా రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇప్పటికీ అనుమతించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రిజిస్ట్రేషన్‌కు ఎందుకు వీలుపడదు ?



పలు గ్రామాల్లో భూములను రీసర్వే చేశారు. ఇనాం భూములుగా ఉన్న వాటిని పట్టా భూములుగా మార్పు చేశారు. గతంలోనే కోర్టు ఉత్తర్వులు ఉన్న క్రమంలో ఇనాం భూములు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడంలేదో అర్థం కావడం లేదు. మాబోటివారు అవసరాల నిమిత్తం భూములను విక్రయించుకోవాలంటే సమస్యలు ఎదురుకుంటున్నాం.

- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు

సమస్య తీరడం మంచి పరిణామం



రీసర్వేతో ఇనాం భూముల సమస్య తీరడం మంచి పరిణామం. దశాబ్దాల కాలంగా ఈ సమస్యతో సతమతమవుతున్న రైతులకు ఇనాం అని రికార్డుల నుంచి తొలగిపోయి పట్టా భూమిగా మార్పు చెందితే మేలు జరిగినట్టే. ఇలా అన్నీ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేస్తే ఈ సమస్య పూర్తిగా సమసిపోయినట్టే.

- అనంతరాజు బాలకృష్ణంరాజు, అల్లూరు

టెన్త్ పరీక్షలకు 28,557 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 174 కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. 28,845 మంది విద్యార్థులకుగాను 28,557 మంది హాజరు కాగా 288 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు రవీంద్రనాథ్ రెడ్డి 4 కేంద్రాలను, డీఈవో డాక్టర్ బాలాజీరావు 3 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 32 కేంద్రాలను పరిశీలించారు. ఇక, ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో భాగంగా బుధవారం సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్ష జరిగింది. 1518 మంది అభ్యాసకులకు గాను 1296 మంది హాజరుకాగా 222 మంది గైర్హాజరైనట్లు డీఈవో పేర్కొన్నారు.



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తోందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం సైదాపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం పొదుపు మహిళలకు ఆసరా బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.39.22 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ సమస్యలను తెలుపుకునేందుకు జనం తరలిరావడంతో ఎమ్పీడీవో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వివిధ సమస్యలపై 181 అర్జీలు అందాయి. స్థానిక గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం, శివకుమార్, తహసీల్దార్ రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మెహన్ కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, వరిగొండ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ నాలుగో విడత మూల్యాంకనం ప్రారంభం

● 1,200 మంది అధ్యాపకుల హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష పత్రాల నాలుగో విడత మూల్యాంకనం బుధవారం మొదలైంది. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైనట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు. మూల్యాంకనం విధులకు 1200 మంది అధ్యాపకులు హాజరుకాగా వీరికి అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఇప్పటికే తెలుగు, హిందీ, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ మూల్యాంకనం పూర్తి కాగా మిగిలిన సబ్జెక్టులను ఏప్రిల్ మొదటి వారంలోగా పూర్తి చేస్తామన్నారు.



వివిధ రకాల బొమ్మల కార్డులను చూపుతున్న తల్లి

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న సామెత ఆ బుడతడికి అచ్చంగా సరిపోతుంది. తల్లిపాలు తాగే వయసులో ఆ తల్లి తర్ఫీదుతో అమోఘమైన తెలివితేటలను ప్రదర్శిస్తున్నాడు. ఆరు మాసాలకే అద్వితీయ ప్రతిభను చాటుతూ నోబుల్ వరల్డ్ రికార్డు దక్కించుకున్నాడు. ఆ చిన్నారే నెల్లూరుకు చెందిన చందలూరి వీరు, ఊహల కుమారుడు వీర శ్రీయాస్.

ఆరు నెలలే...

అన్నీ గుర్తుపట్టేస్తాడు!

- ఈ బుడతడు భలే మేధావి
- తల్లి శిక్షణలో అమోఘ ప్రతిభ
- చిన్నారి వీర శ్రీయాస్‌కు నోబుల్ వరల్డ్ రికార్డు
- ప్రత్యేకంగా అభినందించిన కలెక్టర్ ఆనంద్



నోబుల్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, మెడల్స్‌తో చిన్నారి, తల్లిదండ్రులు

నెల్లూరు (వైద్యం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్టలో నివసించే వీరు వ్యాపారం చేస్తుంటారు. ఆయన భార్య ఊహ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రక్తనిధిలో టెక్నీషియన్‌గా చేస్తున్నారు. వారి కుమారుడు ఆరు నెలల వీర శ్రీయాస్‌కు బుర్రంతా తెలివితేటలే. బిడ్డ తెలివితేటలు గమనించిన ఊహ ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. పక్షులు, కూరగాయలతో కూడిన బొమ్మల కార్డులను చూపిస్తూ వాటి పేర్లు చెబుతుంది. ఆ తర్వాత ఫలానా పేరు గల కార్డు ఏదని అడుగుతుంది. వెంటనే ఆ చిన్నారి తన చిట్టి చేతులతో అమ్మ చెప్పిన పక్షి, కూరగాయల కార్డును కచ్చితంగా గుర్తుపట్టి దాన్ని పట్టుకుంటాడు. ఇందులో ఎక్కడా తడబాటు అనేది ఉండదు. ఒకటి.. రెండు సార్లు ఎన్నో సార్లు ఇలా చేసిన తర్వాత తమ బిడ్డ బాలమేధావి అని నిర్ధారించుకుంది. నోబుల్ వరల్డ్ రికార్డు నిర్వాహకులు కూడా పాలబుగ్గల ఆ పసివాడు మేధావే నంటూ అవార్డు, మెడల్స్ కూడా అందచేశారు. ఇటీవల ఆ చిన్నారితో తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిశారు. శ్రేయాస్ తెలివితేటలకు కలెక్టర్ కూడా సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

మూడు నెలల నుంచే శిక్షణ

తన కుమారుడు వీర శ్రీయాన్‌కు మూడు నెలల వయసుకే ప్రత్యేక తెలివితేటలు ఉన్నట్లు గుర్తించాము. దీంతో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాను. కూరగాయలు, పక్షుల ఫొటోల కార్డులను చూపించి వాటిని వివరించే దాన్ని. ఆ తర్వాత అడిగిన వాటిని వెంటనే గుర్తు పట్టేవాడు. దీనిని గుర్తించి నోబుల్ వరల్డ్ రికార్డు రావడం సంతోషంగా ఉంది.

- ఊహ



కలెక్టర్ ఆనంద్ నుంచి అవార్డు అందుకుంటున్న తల్లిదండ్రులు



నాడు మల్లితోట ప్రధాన రహదారి బురదమయంగా..

పల్లెల్లో సీసీ రోడ్ల కళ

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెలు పూర్తి వసతులను సంతరించుకొని శోభిల్లుతున్నాయి. వైసీపీ హయాంలో చిన్నపాటి పనులు చేపట్టినా బిల్లులు రావన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు చొరవ చూపలేదు. అయితే, టీడీపీ హయాంలో పనుల్లో వేగం పెరిగింది. కలిగిరి పట్టణంలో రద్దీ ప్రాంతమైన మల్లితోట ప్రధాన రహదారి ఒకప్పుడు బురదమయంగా ఉండేది. ఈ ప్రాంతంలోని ప్రజలు, దుకాణాదారులు గత వైసీపీ పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ప్రజలు పడుతున్న అవస్థలను పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బురదరోడ్డును కాస్త సీసీరోడ్డుగా మార్చారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)



నేడు సీసీ రోడ్డు పనులు పూర్తయి..

ఈ-శ్రమ్ క్లెయిమ్‌లకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సురక్ష ప్రమాద బీమా యోజన కింద 2023 ఆగస్టు వరకు ప్రమాదానికి గురైన అసంఘటిత రంగ కార్మికులు క్లెయిములను పొందచ్చునని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2021లో ప్రారంభమైన ఈ పథకం కింద అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు పొందారని తెలిపారు. పరిహారం కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

వికసిత్ భారత్‌కు 10 మంది విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత తదితరులు

వెంకటాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025కు 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీఎస్‌యూలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావుతో కలిసి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపికైన 10 మందిని వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి, దేశస్థాయిలో జరిగే వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఎంపికైన 10 మంది విద్యార్థులు ఈనెల 28న గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ విజయానంద్‌కుమార్‌బాబు, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో డ్రైవర్‌కు అస్వస్థత

● సమయస్ఫూర్తితో బస్సు నిలిపివేత ● ప్రయాణికులు సురక్షితం

సంగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న బస్సులో డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. అయితే, ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సును ఆపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం సంగం మండలంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం నెల్లూరు నుంచి కొండాపురానికి బయలు దేరింది. మార్గమధ్యంలో సంగం రహదారి కూడలిలోకి వచ్చేసరికి డ్రైవర్ అహ్మద్ బాషా అస్వస్థతకు గురయ్యాడు. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి బస్సును కూడలిలో నిలిపివేశాడు. తనకు చెమటలు పడుతున్నాయని, కళ్లు తిరుగుతున్నాయని తెలపడంతో కండక్టర్, ప్రయాణికులు డ్రైవర్‌ను హుటాహుటిన స్థానిక వైద్యశాలకు తరలించారు. అప్పటికే బట్టల్లో మల మూత్రం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పరిక్షించిన వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. ప్రయాణికులను కండక్టర్ మరో బస్సులో ఎక్కించి పంపించారు.



ఆర్టీసీ డ్రైవర్ అహ్మద్ బాషా

ఫాప్టో జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



నూతనంగా ఎంపికైన ఫాప్టో జిల్లా కమిటీ

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్స్(ఫాప్టో) జిల్లా కార్యవర్గం ఎంపికైంది. నగరంలోని దర్గామిట్ట మున్సిపల్ స్కూల్లో బుధవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కే మధుసూదన్‌రావు (ఏపీటీఏ), ప్రధాన కార్యదర్శిగా షేక్ జావీద్ (ఆర్‌యూటీఏ), కో చైర్మన్లుగా మురళీకృష్ణ (డీటీఎఫ్), మాస ప్రసాద్(బీటీఏ), ఎస్ భాస్కర్‌రెడ్డి(ఏపీహెచ్ఎంఏ), డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా వీవీ శేషులు (యూటీఎఫ్), కే నరసింహం(ఎస్టీయూ), సీహెచ్ హజరత్ (ఏపీటీఎఫ్), ఎం పిచ్చిబాబు (ఏపీటీఎఫ్-38) ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకుడు ఎన్వీ రమణయ్య మాట్లాడుతూ నూతన కమిటీ కాలపరిమితి రెండేళ్లని, ఈ సమయంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేసి హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో మాజీ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఉపా ధ్యాయ సంఘాల నాయకులు ఏడుకొండలు, చలపతి శర్మ, మణి సుబ్బు, దశరథ రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎవరు వీళ్లు.. ఎక్కడ నుంచి వచ్చారు!





చింపిరి జుట్టు.. మాసిన దుస్తులు.. నడిరోడ్డుపై ఎటువెళతారో తెలియదు.. ఏవేవో మాట్లాడుకుంటూ తిరుగుతారు.. అడ్డొచ్చినవారిపై దాడి చేసేంత పని చేస్తారు. ఇంతకూ వీళ్ల ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు. మతిస్థిమితం కోల్పోయిన కొంతమంది నెల్లూరు నగరంలో ప్రత్యక్షమవుతున్నారు. ప్రధాన కూడళ్లు, డివైడర్ల మధ్య, పాడుబడిన భవనాలు, రాత్రిపూట మూత బడిన షాపుల ముం దు వీరి ఆవాసాలు. అటు ఇటు తిరుగుతూ దొరికింది తింటూ కాలం వెళ్ల దీస్తున్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు స్పందించి వారికి వైద్యసేవలు అందిస్తే సాధారణస్థితికి చేరుకుంటారు.



- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)

4న డయాలసిస్ కేంద్రం ప్రారంభం

పొదలకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీహెచ్‌సీలో ఏప్రిల్ 4న డయాలసిస్ కేంద్రాన్ని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రారంభిస్తారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ బుధవారం తెలిపారు. పొదలకూరు మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల ప్రజలంతా దీన్ని ఉపయోగించుకోవచ్చునన్నారు. కాగా ఎమ్మెల్యే సోమిరెడ్డి గురువారం పట్టణంలోని గేట్ సెంటర్‌లో నిర్మించిన విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారని ఏఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8462
వెండి కిలో ధర	రూ. 101,500
వెండి ఒక గ్రాము	రూ.104.50

న్యూస్ బాక్స్

క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు

విడవలూరు, మా ర్చి 26 (ఆంధ్రజ్యోతి) : పశువైద్యాధికారు లు, జిల్లా అధికారుల ను సమన్వయం చేసుకుని, ప్రభుత్వం పథకాలను క్షేత్రస్థా యిలో అమలు చేస్తానని ఏపీ పశుసంవర్ధకశాఖ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మౌర్య తెలిపారు. విడవలూరులో బుధవారం అయన విలేకరులతో మాట్లాడారు. తనను ఎన్నుకున్న జాయింట్, డిప్యూటీ, అసిస్టెంట్ డైరెక్టర్లకి ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో పశు వైద్యులకు అనేక సమస్యలు వస్తుంటాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని పరిష్కరిస్తానన్నారు. అలాగే అసోసియేషన్ బలోపేతానికి పాటు పడతానన్నారు. ఆయన ఎన్నికపై విడవలూరు, కోవూరుకి చెందిన పశువైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజీనామా

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త మినగల్లు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పొంగూరు లక్ష్మీప్రసన్న బుధవారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆమె తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో శ్రీహరికి అందజేశారు. అనంతరం రికార్డులను బుచ్చి హౌసింగ్ ఏఈ పెంచలయ్యకు అప్పగించారు.

రెండు చెరువులకు వేలం

మనుబోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు సచివాలయంలో బుధవారం రెండు చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు వేలం నిర్వహించారు. ర్పంచు పాళెంపాటి జానకమ్మ అధ్యక్షతన కార్యదర్శి బాబురెడ్డి వేలం ప్రారంభించారు. పెద్ద చెరువును చెమర్తి సుధీర్ రూ. 1.71లక్షలకు దక్కించుకున్నారు. చిన్న చెరువును గుమ్మా సురేష్ రూ.35వేలుకు దక్కించుకున్నట్లు కార్యదర్శి తెలిపారు.

విద్యుత్ అధికారి తీరుపై గ్రామస్థుల నిరసన

రాపూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని మల్లమ్మగుంటలో గత అయిదు రోజులుగా రాత్రి పూట విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపివేస్తున్నారని విద్యుత్ ఏఈని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా మాట్లాడడంతో గ్రామస్థులు సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. తమ పట్ల అమర్యాదగా, అనుచితంగా ప్రవర్తించిన విద్యుత్ శాఖ ఏ.ఈ, సబ్‌స్టేషన్ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

రాపూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గత రెండేళ్లకు సంబంధించి అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. అకడమిక్ అడ్వైజర్స్ డీఆర్ వాసప్ప, మంజు నాథరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ విభాగాలను సందర్శించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షితాయి హుండీల లెక్కింపు



హుండీల లెక్కింపులో పాల్గొన్న అధికారులు, భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి26,(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. జనవరి 1 నుంచి బుధవారం వరకు రూ.34,74,137 ఆదాయం వచ్చిందని ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నిత్యాన్నదాన హుండీల ద్వారా రూ. 2,26,012, భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలు 96 గ్రాములు, వెండి వస్తువులు 240 గ్రాములుగా తెలిపారు. యుఎస్‌ఏ డాలర్లు4, యూఏఈ డాలర్లు 10, సౌత్ ఆఫ్రికా ర్యాండ్స్ 1940, యూరో కరెన్సీ 15, ఖతార్ రియల్ 1, సింగపూర్ డాలర్స్ 20ని భక్తులు సమర్పించారని తెలిపారు. లెక్కింపులో దేవదాయశాఖ అధికారి శ్రీధర్‌నాయుడు, ఏపీజీబీ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి26(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి, వైస్ చైర్మన్లు, బుధవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌బాను, కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, నాయకులు చాందీని, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లో ప్రధాన రహదారి

- భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- ముత్తుకూరులో నిత్యం ట్రాఫిక్ సమస్యలే..!

ముత్తుకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం కృష్ణపట్నం పోర్టులోని పామాయిల్ పరిశ్రమలు, థర్మల్ కేంద్రాలకు వెళ్లే వాహనాలతో ముత్తుకూరు-నెల్లూరు ప్రధాన రహదారి రద్దీగా మారింది. ప్రధానంగా పోర్టుకు నీటిని తరలించే వాటర్ ట్యాంకర్లతో సమస్యగా తీవ్రంగా ఉంటోంది. అతి వేగంగా వెళ్లడం, లైసెన్సు లేనివారు వాహనాలు నడపడంతో ట్యాంకర్ల ధాటికి జనం జడుసుకుంటున్నారు. కొన్ని ట్యాంకర్లు అయితే కనీసం మూతలు కూడా లేకుండా వెళ్తుండడంతో, వాటి నుంచి ఎగిరిపడే నీటి దెబ్బకు పక్కనే వెళ్తున్న వాహనదారులు తడిసి ముద్దవుతున్నారు.



ఇరుకుగా మారిన ముత్తుకూరు ప్రధాన రహదారి

● పేరుకే డబుల్ రోడ్డు

ప్రధాన రహదారి పేరుకు మాత్రమే డబుల్ రోడ్డుగా ఉన్నా, ఇక్కడ సింగిల్ రోడ్డు కూడా కనిపించదు. ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించారు. అయితే బీసీ కాలనీ నుంచి మసీదు సెంటరు వరకు రోడ్డు రెండు వైపులా ఉన్న కాలువలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఆక్రమణలు రోడ్డుపైకే విస్తరించి ఉండడం గమనార్హం. ఇదేమని అడిగితే అధికార పార్టీ నాయకుడి పేరు చెప్పి తప్పించుకుంటున్నారు. భారీ వాహనాల కారణంగా ప్రధాన రహదారిపై ఉన్న పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఇటీవల ఉన్నత పాఠశాల కమిటీ సభ్యులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అయినా ట్రాఫిక్ ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పొదలకూరులో సోమిరెడ్డి జన్మదిన వేడుకలు

పొదలకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక మాన్యంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు టీఎన్‌ఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్, స్కూల్ చైర్‌పర్సన్ కే. మౌనిక, హెచ్‌ఎం అంజిరెడ్డి, టీడీపీ నేతలు డేగా హరి, షేక్.సుబాన్, పాలెం శివకుమార్‌నాయుడు, బ్రహ్మదేవి, చంద్రశేఖర్, గాలి సాయి, గాజుల విజయ్, తదితరులు పాల్గొన్నారు.





పొదలకూరు : విద్యార్థులు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నేత సందీప్, పట్టణంలో 69కేజీల కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● రక్తదాన శిబిరం

సోమిరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం నెల్లూరు వేదాయపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కూడా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో యువత రక్తదానం చేశారు. పొదలకూరు నేతలు తలచీరు మస్తాన్‌బాబు, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి ఫొటోను సోమిరెడ్డికి అందజేశారు. రావూరి సుధీర్‌నాయుడు కాణిపాకం నుంచి తెచ్చిన ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొద్దులూరు మల్లికార్జుననాయుడు, కోవూరు వెంకటేశ్వర్లునాయుడు, పుటిపాటి వెంకటరత్నంనాయుడు, గంటా మల్లికార్జున్‌యాదవ్, దేవినేని శరత్‌బాబు, బోగోలు భాస్కర్‌రెడ్డి, సర్వేపల్లి విశ్వరూపాచారి పాల్గొన్నారు.

● టీడీపీ పొదలకూరు మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ ఆధ్వర్యంలో నరసారెడ్డి కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాత్రి సంగం రోడ్డు నుంచి గేట్ సెంటర్ వరకు నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 69కేజీల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు డేగా యశ్వంత్‌రెడ్డి, ఆదాల మురళీరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో కేకు తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

● మజ్జిగ పంపిణీ

సోమిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పొదలకూరులో జనసేన నాయకులు, కార్యకర్తలు పంచాయతీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసినేటి అనీల్‌కుమార్, పీ.విష్ణువర్థన్, యశ్వంత్, విజయ్, ఆనంద్, చిన్నయ్య, మోహిత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మనుబోలులోని ఆటో సెంటర్ వద్ద టీడీపీ నేతలు భారీ కేక్ కట్ చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, మధునాయుడు, సాని వెంకటరమణయ్య, ఉడతా విజయ్ కుమార్, మానుగుంట సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కొమ్మలపూడిలో టీడీపీ నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో చిన్నారులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

● వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): సోమిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని కంటేపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పేదలకు అన్నదానం చేసి దుస్తులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లో సోమిరెడ్డి పేరిట ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కసుమూరు దర్గాలో నేతలు ప్రార్థనలు నిర్వహించి, పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.జనసేన నేత బీ. సురేష్‌నాయుడు ఎమ్మెల్యేని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

● తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి) : సోమిరెడ్డి జన్మదిన వేడుకలను నెల్లూరు వేదాయపాలెంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వెంకన్నపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులు చింతా సీతారామయ్య సోమిరెడ్డిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడుతూ సోమిరెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాక్షించారు.

జోనల్ వర్క్‌షాపులో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సురేష్‌రెడ్డి

కోవూరు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో బుధవారం కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు బాలకృష్ణ, గోకుల్ సుచికేత్‌జీ, కేపీ ప్రసాద్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు యల్లయ్య, రమేష్, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు తహసీల్దారుగా స్వప్న



తహసీల్దారు స్వప్నకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారుగా స్వప్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మర్రిపాడు తహసీల్దారుగా పనిచేసి ఇటీవల కాలం వరకు సెలవులో ఉన్న ఆమెను ముత్తుకూరు తహసీల్దారుగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన స్వప్నకు మండల టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఈపూరు మునిరెడ్డి, నీలం మల్లికార్జున యాదవ్, అక్కయ్యగారి ఏడుకొండలు తదితరులు ఆత్మీయ స్వాగతం పలికి ఆహ్వానించారు.

మాచర్లవారిపాలెంలో మెగా వైద్య శిబిరం



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తోటపల్లిగూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచర్లవారిపాలెంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌వారి సీఎస్‌ఆర్ నిధులతో అపోలో టెలి మెడిసిన్ నెట్‌వర్క్ ఫౌండేషన్ వైద్యుల ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మాదాల రూపేష్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సుహేల్‌బాషా శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎస్‌ఆర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గోతాలు లేకుండా ధాన్యం కొనుగోళ్లా...?



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ముత్తుకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో గోతాలు లేకుండా రైతుల దగ్గర ధాన్యాన్ని ప్రభుత్వం ఎలా కొనుగోలు చేస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ప్రశ్నించారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం, ఏపీ రైతు సంఘం నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వారు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గోతాలే అందుబాటులో లేవని,దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. వెంటనే గోతాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గడ్డం అంకయ్య, షేక్.మస్తాన్, మోహన్‌రావు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అభివృద్ధికి సముద్ర తీరం ఎంతో దోహదం

వెంకటాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి 970 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న సముద్రతీరం ఎంతో దోహదపడుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో రెండురోజులపాటు జరిగిన బ్లూ రివల్యూషన్ మెరైన్ సిస్టమ్స్ అనే అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సముద్రతీరం వెంబడి చాలానే ఓడరేవులు ఉన్నాయని, వాటి వల్ల పరిశ్రమలు వస్తాయన్నారు. ఆక్వా ఎగుమతులు, మత్స్య సంపదలో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ నిలిచిందన్నారు. జిల్లాలో మత్స్య కళాశాల కూడా ఉందన్నారు. జిల్లాలో రామాయపట్నం ఓడరేవు కూడా వస్తుందన్నారు.సముద్రతీర ప్రాంతాల్లో ఉత్పత్తులు, ఆదాయం పెంచుకొని రాష్ట్రానికి, దేశానికి సంపద పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండురోజులపాటు జరిగిన సదస్సుకు సమన్వయకర్తలుగా వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, డాక్టర్ ఎం హనుమారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, పూర్వ రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు అభినందనలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

వెంకటాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ప్రశంసించారు. మండలంలోని సరస్వతీ నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారు భారతీయ భాషా దివస్ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వీఎస్‌యూ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో వీఎస్‌యూలో బుధవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మొదటిస్థానంలో నిలిచిన పీ. ప్రత్యూషకు రూ.5 వేలు, రెండో స్థానంలో నిలిచిన పీ. షాజిదాబేగంకు రూ.3వేలు, మూడో స్థానంలో నిలిచిన పీ. జ్యోతికి రూ.2వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, తెలుగుశాఖ ఇన్‌చార్జ్ హెడ్ డాక్టర్ ఎం త్యాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సీ.రాజారామ్, డాక్టర్ టీ విమల, డాక్టర్ కే. లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

క్వారీ గుంతలో ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు



ఏలూరు పెంచలప్రసాద్ (ఫైల్)

కలువాయి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలసి కాలనీ సమీపంలోని కంకర క్వారీలో ఈతకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం కలువాయి మండలం కేశమనేనిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గిరిజన కాలనీకి చెందిన ఏలూరు పెంచలప్రసాద్ (18) స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. పాఠశాలకు ఒంటిపూట బడులు కావ డంతో మధ్యాహ్నానికి విధులు ముగిం చుకుని ఇంటికి చేరాడు. స్నేహితులందరూ ఈతకు వెళ్లారని తెలుసుకుని పెంచలప్రసాద్ కూడా క్వారీ గుంతలో ఈతకు దిగాడు. కొంతదూరం ఈత కొట్టి మునిగిపోతూ కేకలు వేశాడు. గమనించిన స్నేహితులు అతడిని కాపాడే ప్రయత్నం చేశారు. వీలుకాకపోవడంతో వారు కాలనీ వాసులకు తెలిపారు. గల్లంతైన యువకుడి కోసం రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా దొరకలేదు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని రంగనాయకుల పేట రైలు వీధిలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (40) మద్యం సేవించి రహదారిపై అపస్మారక స్థితిలో పడి పోయాడు. స్థానికులు 52వ డివిజన్ రెవెన్యూ సెక్రటరీ నరేంద్రబాబుకు సమాచారమిచ్చారు. ఆయన 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరేంద్రబాబు ఫిర్యాదుతో సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ కోసం పోలీసులు విచారిస్తున్నారు.

స్కూటర్, ఆటో ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు



గాయపడ్డ బాలకృష్ణ

నెల్లూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - తాటిపర్తి రహదారిపై వెల్లంటి వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు కాలనీకి చెందిన మేకల బాలకృష్ణ తన అత్తగారి ఊరైన తాటిపర్తికి స్కూటర్‌పై కుమార్తె వెన్నెల, కుమారుడు అంకిత్, బావ బూదూరు శీనయ్యతో బయల్దేరాడు. కందమూరు మలుపు తిరిగాక వెల్లంటి నెరేళ్ల చెరువు సమీపాన వెల్లంటి గ్రామానికి చెందిన వ్యక్తి ఆటో అతివేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. దీంతో వీరంతా చెల్లాచెదురుగా పడిపోయారు. స్కూటర్‌పై వస్తున్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన సౌత్‌మోపూరు పీహెచ్‌సీ కి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనలో ఆటో అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

రోడ్డు పక్కన అస్థిపంజరం గుర్తింపు

ఆత్మకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి మున్సిపాల్టీ పరిధిలో అల్లీపురం క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరాన్ని బుధవారం గుర్తించినట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు. సుమారు 58 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహం ఆనవాళ్లు ఎవరైనా గుర్తించినట్లయితే స్థానిక పోలీసులకు 9440796390 నెంబరుకు ఫోన్‌చేసి వివరాలు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

మహిళ మృతిపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచేడు గ్రామంలో వరికోతకు వెళ్లిన నాగూరు ప్రమీల (46) ట్రాక్టర్ కింద పడి మృతిచెందడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి బుధవారం తెలిపారు. మంగళవారం ఈ ఘటన జరగ్గా బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు. పంచేడు దళితవాడలో అంత్యక్రియలు ముగిశాయి.

రైల్వే సీఐగా సుధాకర్



నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రైల్వే సీఐగా ఏ సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుధాకర్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు, వాకాడు, దగదర్తి, దుత్తలూరు, వేదాయ పాలెం పోలీసు స్టేషన్లలో ఎస్‌ఐగా పనిచేశారు. 2020లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది కావలి, తెనాలి, సీఐడీ, నెల్లూరు ఎస్సీఎస్టీ సెల్‌లో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రయ్ మంటూ డివైడర్ పైకి..



డివైడర్ రాళ్లపైకి ఎక్కిన కారును దించేందుకు శ్రమిస్తున్న యువకులు

నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద కూరగాయల మార్కెట్‌కు వెళ్లే వైపు మంగళవారం అర్ధరాత్రి ఓ కారు వేగంగా వెళుతూ డివైడర్ రాళ్లపైకి ఎక్కేసింది. దీనిని చూసిన స్థానికులు అర్ధరాత్రి సినిమా షూటింగా లేక రీల్స్ చేస్తున్నారా అంటూ కేకలేశారు. అసలు విషయం ఏమిటంటే... అతివేగంగా వెళుతున్న ఆ కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ రాళ్లపైకి ఎక్కేసింది. ఆ వాహనాన్ని కిందకు దించేందుకు కొందరు యువకులు ఎంత శ్రమించినా ఫలితం లేకపోవడంతో ఆ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 397



29న హరివిల్లు ఉగాది వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26(ఆంధ్రజ్యోతి) : పురమందిరంలో ఈ నెల 29న సాయంత్రం హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందని నిర్వాహకుడు దోర్నాల హరి బాబు తెలిపారు. మాగుంట లే అవుట్‌లోని ఓ రెస్టారెంట్‌లో బుధవారం ఉగాది పురస్కారం బ్రోచర్లను సినీనటుడు తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. 14 ఏళ్లుగా ఉగాది పురస్కారాలు ఇస్తున్న దోర్నాల హరిబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, భాస్కర్, అమీర్‌జాన్, లక్ష్మీకాంత్ బాబు, దోర్నాల కామేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

29న బార్ అసోసియేషన్ వార్షికోత్సవం

నెల్లూరు (లీగల్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ వార్షికోత్సవం జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి కే శ్రీనివాస్ రెడ్డి, అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామిని, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్ర శేఖర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొనాలని కోరారు.

అత్యాధునిక సౌకర్యాలతో జీవీకే ఇంటర్నేషనల్ స్కూల్

● కస్తూరిదేవి విద్యాలయం కమిటీ కార్యదర్శి శేషారెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో జీవీకే ఇంటర్నేషనల్ బాలికల పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకస్తూరిదేవి విద్యాల యం కమిటీ కార్యదర్శి దొడ్ల శేషారెడ్డి తెలిపారు. బుధవారం కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఆయన విలేకరులతో మాట్లా డుతూ ప్రీమియర్ సీబీఎస్‌ఈ బాలికల పాఠశాల ఈ విద్యాసంవత్సరం నుంచే అందుబాటులోకి రానుందన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త జీవీకే రెడ్డి ఈ పాఠశాల నిర్మాణానికి రూ.25 కోట్లు అందించినట్లు తెలిపారు. విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక కోణంలో ఆలోచించి అందుబా టులో ఫీజులను కూడా నిర్ణయించామని తెలిపారు. కమిటీ సభ్యురాలు, పాఠశాల డైరెక్టర్ డీ ఉషారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించా మని తెలిపారు. భవిష్యత్‌లో సీబీఎస్‌ఈ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ శిక్షణ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పీవీ ప్రసన్న కుమార్‌రెడ్డి పీ ఆదిశేషారెడ్డి, ఎం రామశేఖర్, పరిపాలన అధికారి ఎం నరేష్ పాల్గొన్నారు.

మహిళపై దాడికి పాల్పడిన వారిపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మహిళ మీద దాడిచేసిన వారిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని కొండాయపాళెంలో నివసించే శైలజ గతనెలలో ఇంటి మరమ్మతుల కోసం ఇంటి ముందు రహదారిపై ఇసుకను నిల్వ ఉంచారు. దీనికి అభ్యంతరం చెబుతూ పక్కింటి పద్మమ్మ, మరో ఇద్దరు ఆమెపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొని అర్హులైన యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో వరకు చదివిన యువత ఆధార్, బయోడేటాతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు.

జీజీహెచ్‌కు ట్రాలీలు, బల్లల వితరణ

నెల్లూరు (వైద్యం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి బుధవారం దాత గొంట్ల సుభాషిణి భర్త ప్రకాశం జ్ఞాపకార్థం రెండు ట్రాలీలు, నాలుగు బల్లలను సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌కు అందించారు. విజయవాడకు చెందిన లియోటెక్ సంస్థ సహకారంతో వీటిని అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీ మహేశ్వర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, డాక్టర్ సుశీల్, డాక్టర్ గీతాలక్ష్మి పాల్గొన్నారు.

కార్మికులకు భద్రతా సేవలు అందించాలి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచనల మేరకు కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో సూచించారు. కార్మికుల భద్రతకు యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పనివేళల్లో మార్పులు చేయాలని, పని ప్రదేశాల్లో అత్యవసర మందులు, చల్లనీరు, ఓఆర్ఎస్, ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పనిచేయించొద్దని యజమానులకు సూచించారు.

గుంతలు పూడుతున్నాయ్!

● నగరంలో రోడ్లను గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
● అడుగడుగునా గుంతలతో ఐదేళ్లూ ప్రజల అవస్థలు
● కూటమి ప్రభుత్వంలో బాగుపడుతున్న రహదారులు



పద్మావతి నగర్ ప్రాంతంలో దెబ్బతిన్న చోట కాంక్రీట్‌ను తొలగించి మరమ్మతులకు సిద్ధం చేసిన సిమెంటు రోడ్డు

నెల్లూరు(జడ్పీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో గతుకుల రోడ్లకు మోక్షం లభించింది. గత వైసీపీ పాలనలో ఐదేళ్లు రోడ్లను గాలికి వదిలేయగా, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. దీంతో నగరంలోని గుంతల రోడ్లు అందంగా తయారవుతున్నాయి. దాదాపుగా రూ.27కోట్ల నిధులతో గోతులు పూడ్చి తారు, సీసీ రోడ్లన్నింటినీ అభివృద్ధి చేస్తున్నారు. నగరంలో 2014-19 సంవత్సరాల మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రూ.1100కోట్లతో తాగునీటి పథకం, భూగర్భ డ్రైనేజీ పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని అన్ని రోడ్లను పగులగొట్టి భూగర్భ డ్రైనేజీ పైపులైన్లతోపాటు, తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేసింది. అనంతరం రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టగా ఎక్కువ భాగం పనులు పూర్తిచేసినప్పటికీ ఎన్నికలు రావడంతో కొంతమేర పనులు అక్కడక్కడ నిలిచిపోయాయి. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అటు భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతోపాటు గతుకుల రోడ్లను కూడా గాలికి వదిలేసింది. దీంతో రోడ్లపై ప్రయాణం చేయాలంటే నగర ప్రజలు ఇబ్బందులు పడడమేకాక ప్రమాదాలకు గురయ్యారు. ప్రధాన రహదారులతోపాటు వీధుల్లోనూ ఇదే పరిస్థితి. అయితే గతేడాది ఎన్నికలతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. నగరంలో 945 రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారు. వీటిని బాగు చేయడానికి రూ.27 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దీంతో సీసీ రోడ్లు దెబ్బతిన్న చోట అంతవరకు తొలగించి ప్యాచ్ వర్కులతో సాఫీగా మారుస్తున్నారు. అలాగే కల్వర్టుల దగ్గర అప్రోచ్ రోడ్లు వేస్తున్నారు. ఈ చర్యలతో నగర రోడ్లు మళ్లీ కొత్తశోభను సంతరించుకున్నాయి.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులతో జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, జేసీ కార్తీక్ తదితరులు

నెల్లూరు (జడ్పీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ కే రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ 198 మంది విద్యార్థులకు 262 ఉపకరణాలు అందజేశారు. అరుణమ్మ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో నమోదైన విద్యార్థులకు వీల్‌చైర్స్, హియరింగ్ ఎయిడ్స్, సీపీ కుర్చీలు, రోలేటర్లు, డిజిటల్ విద్యకు టాబ్స్ వంటివి అందిస్తున్నట్లు చెప్పారు.

నూనెలు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

● లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం ఏ ఏ దేశాల నుంచి నూనెలను దిగుమతి చేసుకుంటోందని బుధవారం లోక్‌సభలో నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిబాయ్ బంభానియా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. 57శాతం ఆహార నూనెలను వివి ధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా నుంచి నూనెలను దిగుమతి చేసుకుంటున్నా మని చెప్పారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించి ఆహార నూనెల్లో దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్, ఆయిల్ పామ్‌ను కూడా ప్రారంభించిందన్నారు.

ముందుగా గుర్తిస్తే పెద్ద పేగు క్యాన్సర్‌ను నివారించవచ్చు

● అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్

నెల్లూరు (వైద్యం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పెద్ద పేగు (కొలరెక్టర్) క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయంచేయ వచ్చని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునిక జీవనశైలి కారణంగా ఇటీవల పెద్ద పేగు క్యాన్సర్ ప్రబలుతోందని చెప్పారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో దీని నుంచి బయటపడవచ్చన్నారు. ఆసుపత్రిలో క్యాన్సర్ రోగులకు ఆధునాతన చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకాలజిస్ట్ డాక్టర్ హరిత, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నితీష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ హిమబిందు, ఆసుపత్రి హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కూటమి వల్లే ప్రజాతంత్రానికి ముప్పు

● సీపీఐ నగర కార్యదర్శి నగేంద్రసాయి



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ కూటమి వల్లే లౌకిక, ప్రజాంతంత్ర వాదానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి ఆరోపించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు మతోన్మాద శక్తులపై బుధవారం సాయంత్రం నగరంలోని గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి దేశంలో లౌకిక వాదాన్ని అణచివేయాలని చూస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో లౌకిక శక్తులన్నీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు మాఫీ చేస్తూ సామాన్ల రుణాలు చెల్లించకుంటే మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామరాజు, రమణ య్య, షాన్‌వాజ్, జిలానీబాషా, నాగేంద్ర, షేక్ మున్నా, మస్తాన్, షరీఫ్, వినోదిని, వనజ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి ఏసీ బస్ షెల్టర్లు

● నగర కమిషనర్ సూర్యతేజ



బస్‌షెల్టరును పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వినియోగంలో లేని ఏసీ బస్ షెల్టర్లను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ వెల్లడించారు. బుధవారం మెయిన్ రోడ్డుపై పలు ప్రాంతాల్లోని బస్ షెల్టర్లను ఆయన ఇంజనీరింగ్ అధికారుల తో కలిసి పరిశీలించారు. వేసవి కాలం మొదలైనందున ఏసీ బస్ షెల్టర్లను అతి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. షెల్టర్లకు మరమ్మతులు పూర్తి చేసి సౌర విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్య ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య 522వ ఆరాధన మహోత్సవం బుధవారం నగరంలోని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత నృత్య పాఠశాలలో ఘనంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి, అన్నమాచార్యులు చిత్రపటాలకు పూజలు చేసి విద్యార్థులు అన్నమయ్య సాహిత్య సేవను స్మరించుకున్నారు. అన్నమయ్య కీర్తనలు గానం, నృత్యం చేశారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, తిరుపతమ్మ, పినాకపాణి లోకేష్ బాబు, శ్రీవత్సల, వైష్ణవీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్‌పై జీవో విడుదల

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 26(ఆంధ్రజ్యోతి): నేతన్నల ఉచిత విద్యుత్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది. అర్హత కలిగిన చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంపై అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. చేనేత గుర్తింపు కార్డుకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కూడా చేసుకుంటున్నారని, వాటిని పరిశీలించి అర్హత కలిగిన వారికి ఆన్‌లైన్‌లోనే గుర్తింపు కార్డులు ఇస్తామని చేనేత, జౌళిశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 206 మంది 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. గుర్తింపు కార్డుల ప్రక్రియ పూర్తయితే జిల్లాలో దాదాపుగా 3600ల చేనేత కుటుంబాలు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంది.

48వేల టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 48వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం 3వేల300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు రూ.100.9 కోట్లు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. రైతులందరూ దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డి పుట్టినరోజు

● ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించిన చంద్రమోహన్‌రెడ్డి



రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నగరంలో వేదాయపాళెంలోని ఆయన నివాసంలో బుధవారం అట్టహాసంగా జరిగాయి. సర్వేపల్లి నియోజకవర్గంతోపాటు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యువత ప్రత్యేకంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. వియానీ హోంలో చిన్నారులకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. సోమిరెడ్డి బాల్యంతోపాటు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంతో కూడిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు డాక్టర్ జెడ్ శివప్రసాద్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీకుమార్‌రెడ్డి



సోమిరెడ్డి పుట్టినరోజు వేడుకలో శ్రీకుమార్‌రెడ్డి

నెల్లూరు (సిటీ), మార్చి 26, (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి అల్లీపురానికి చెందిన టీడీపీ నేత బండి శ్రీకుమార్ రెడ్డి బుధవారం జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. వేదాయపాళెంలోని సోమిరెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గం సోమిరెడ్డితోనే అభి వృద్ధి చెందిందని, ఆయన నాయకత్వం మరింత కాలం ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అల్లీపురానికి చెందిన టీడీపీ నాయకులు వల్లూరు అజయ్‌కుమార్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి కూడా సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రమోహన్‌రెడ్డికి కల్యాణ్‌రెడ్డి శుభాకాంక్షలు



సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేలూరు కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నెల్లూరులో సోమిరెడ్డిని కలసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ప్రజాపాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు సోమిరెడ్డికి సంపూ ర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో సునీల్, దినేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కష్టకాలంలో కార్యకర్తలకు బీద అండ

● రవిచంద్ర అభినందన సభలో కోటంరెడ్డి సోదరులు



గుర్రాల బండిలో బీదను తోడ్కొని వస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి26, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిల్లాలో కార్యకర్తలకు అండగా నిలిచిన వ్యక్తి బీద రవిచంద్ర అని నెల్లూ రు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి తెలిపారు. బీద రవిచంద్రకు టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కేటాయించడంతో ఆయనకు బుధవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద అభి నందన సభ ఏర్పాటు చేశారు. ముందుగా బీద నివాసం నుంచి సభాస్థలి వరకు గుర్రపు బండిపై ర్యాలీగా తీసుకు వచ్చారు. బీద మాట్లాడుతూ కోటంరెడ్డి సోదరు లతో తనకు 35 ఏళ్ల నుంచి స్నేహం ఉందని చెప్పారు. కార్యకర్తలకు భరోసా ఇవ్వడంలో రూరల్ ఎమ్మెల్యే తరువాతే ఎవరైనా అని కొనియాడారు. కాగా, అభినందన సభ సందర్భంగా గుర్రం జాషువా గ్రంథాలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాసిం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్య, ఇన్‌చార్జ్ జనార్దన్ తదితరులు బీదను కలిశారు. ఆ గ్రంథాలయ భవన నిర్మాణ విషయాన్ని ప్రస్తావించగా నూతన గ్రంథాలయ భవనాన్ని పూర్తి చేసి జూన్‌లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని రవిచంద్ర వారికి హామీ ఇచ్చారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం



రోడ్డు మధ్యలో నిలబడి పక్కగా వెళుతున్న ఆటోను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న యువకులు

నెల్లూరు(క్రైం), మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): చుక్కెయ్యరా.. చిందెయ్యరా! అన్నట్లు కొందరు యువకులు మద్యం మత్తులో నగరంలోని కుసుమ హరిజ నవాడ సమీపంలో నడిరోడ్డుపై బుధ వారం వీరంగం చేశారు. స్థానిక వైన్ షాపులో పూటుగా మద్యం సేవించిన ఆరుగురు యువకులు రోడ్డుకు అడ్డంగా నిల్చోని చిందులు వేశారు. ఒకరినొకరు నెట్టుకుంటూ, రోడ్డుపై వాహనాల ను ఆపుతూ, పక్కనే ఉన్న దుకాణాల్లోకి ప్రవేశించి అసౌకర్యం కలిగించారు. వీళ్లతో మనకెందుకులే! అన్నట్లు ప్రజలు ఆ పక్కకు తప్పుకొని వెళ్లిపోవడం గమనార్హం.

29న విశ్వబ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం 29వ సర్వసభ్య సమావేశం, వార్షికోత్సవం ఈనెల 29న నిర్వహిస్తున్నామని ఆ సంఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరి చెంగయ్య ఆచారి తెలిపారు. బుధవారం నగరంలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో వార్షికోత్సవం కరపత్రాలు ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి విశ్వబ్రాహ్మణులు అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇందుకూరు రమేష్ ఆచారి, సంఘం సభ్యులు అలిమేటి సుబ్రహ్మణ్యం ఆచారి, శ్రీహరి ఆచారి, దండపాణి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ముందస్తు ఉగాది వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోట ఆది శంకర ధ్యాన మందిరంలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు చక్రాల వారి ట్రస్ట్ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతాయని, సాయంత్రం 6.30 గంటలకు సహస్ర నామార్చన పారాయణం జరుగుతుందని పేర్కొన్నారు.

29న ఉగాది సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉగాది సంబరాలు జరుగుతాయని కేతా సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 నుంచి తెలుగు పాటల పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. గానగంధర్వులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు పాడాలని వర్ధమాన గాయనీ గాయకులకు పిలుపునిచ్చారు.


రానున్న (2025-26) ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టనున్నారు? శాఖలవారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలేవీ? వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలి? వీటన్నింటినీ కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో రెండో రోజైన బుధవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుమల, తిరుపతికి హరిత ఛత్రం

- గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరునగరం
- మామిడి నుంచి విలువైన ఇతర పంటల సాగుకు రైతుల మళ్లింపు
- బిందు సేద్యంతో ఉద్యాన పంటల సాగు విస్తరణ
- సీఎం సమీక్షలో జిల్లా ప్రణాళిక, లక్ష్యాలు నివేదించిన కలెక్టర్



తిరుమల, తిరుపతికి హరిత ఛత్రం ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. తిరుమల కొండలపై అడవుల విస్తీర్ణాన్ని 68 నుంచి ఈ ఏడాది 75 శాతానికి పెంచనుంది. ఆపై విడతలవారీగా 90 శాతానికి చేర్చనుంది. తిరుపతి నగరంలోనూ 15 లక్షల మొక్కలు నాటి సామాజిక వనాల ఏర్పాటుదిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంది. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంలో భాగంగా తిరుపతిలో నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయనుంది. వీలైన చోట్ల పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోనుంది. మరోవైపు వివాహాలు, నిశ్చితార్థాలకు ప్రస్తుత తరం పర్యాటక ప్రాంతాలను ఎంచుకుంటోంది. ఈ క్రమంలో తిరుపతిని గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా అభివృద్ధి పరచాలని జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇతర వినోదాల పరంగానూ తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తోంది. మరో ఏడు ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం కానున్నాయి. వాటిలో ఒబెరాయ్, హయత్, మారియట్, అట్మోస్పియర్ వంటివి ఉన్నాయి. తిరుపతి వచ్చే యాత్రికులు రెండు రోజుల పాటు నగరంలో గడిపేలా లగ్జరీ గదుల సంఖ్యను రెట్టింపు చేయాలని, తద్వారా 4700 మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పర్యాటకంగా తిరుపతిని అభివృద్ధి పరిచేందుకు నగరంలోని అనేక చెరువులనూ ఆధునికీకరించి 'సిటీ ఆఫ్ ట్యాంక్స్'గా మార్చాలని ప్రతిపాదించింది.

డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగుకు మళ్లింపు

సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు పంటల మార్పిడిని ప్రోత్సహించడం, కొత్త రకాలను పరిచయం చేయడం, ఉద్యాన పంటలను బిందు సేద్యం కిందకు తేవడం వంటి నిర్ణయాలను యంత్రాంగం తీసుకుంటోంది. ఈ ఏడాది మామిడి సాగు నుంచి రైతులను డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విలువైన పంటల సాగువైపు మళ్లించేందుకు ప్రయత్నించనుంది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఈ ఏడాది 29,349 హెక్టార్ల నుంచీ 8 శాతానికి అంటే 31,803 హెక్టార్లకు పెంచాలని లక్ష్యం విధించుకుంది. ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ కార్యక్రమం అమలు చేయనుంది. ఉత్తమ పంట సాగు విధానాలను అమలు పరిచేలా 500 హెక్టార్లలో ఎగుమతులకు అవకాశం కల్పించనుంది. బిందు సేద్యం కింద ప్రస్తుతమున్న 20,650 హెక్టార్లను 23750 కు పెంచాలని లక్ష్యం నిర్దేశించుకుంది. ఇలా 15 శాతం విస్తీర్ణం పెంపుతో పాటు దిగుబడినీ 25 శాతం పెంచాలని లక్ష్యం పెట్టుకుంది. పంటకోతల అనంతరం మద్దతు చర్యల్లో భాగంగా 2 వేల హెక్టార్ల పంట దిగుబడులను నిల్వ ఉంచడానికి గోదాములు, కోల్ట్ స్టోరేజీ ప్లాంట్లు, రైపనింగ్ యూనిట్లు, ఇంటిగ్రేటెడ్ యూనిట్లు ఏర్పాటు చేయనుంది.

డ్రోన్ల వినియోగంతో లక్ష ఎకరాల సాగు

ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయాన్ని 21.53 శాతం నుంచీ 34.32 శాతానికి పెంచాలని లక్ష్యం నిర్దేశించుకుంది. అదే సమయంలో హెక్టారుకు పంట సాగు వ్యయం కనీసం రూ.2 వేలు చొప్పున తగ్గించే కార్యక్రమాన్ని 25 వేల ఎకరాలకు అమలు చేయనుంది. దానికి సమాంతరంగా వ్యవసాయంలో యాంత్రికీకరణకు ప్రాధాన్యమిచ్చింది. 33 వేల మంది రైతులకు సంబంధించిన లక్ష ఎకరాల్లో పంటల సాగుకు డ్రోన్లు వినియోగించాలని నిర్ణయించింది. దీనికి 37 డ్రోన్లు సమకూర్చనుంది.

పాల దిగుబడి, మాంసం ఉత్పత్తుల పెంపు

పాడి పశువుల వ్యాక్సినేషన్, డీ వార్మింగ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగించడంతో పాటు 20 వేల పశువులకు కృత్రిమ గర్భధారణ వంటి కార్యక్రమాలు చేపట్టనుంది. అంతిమంగా జిల్లాలో ఈ ఏడాది పాడియావుకు రోజుకు సగటు పాల దిగుబడిని 7.65 లీటర్ల నుంచీ 8.25 లీటర్లకు పెంచాలని లక్ష్యం నిర్దేశించుకుంది. మాంసం ఉత్పత్తులను ఇపుడున్న 40,650 టన్నుల నుంచీ ఏడు శాతం పెంచేలా లక్ష్యాన్ని పెట్టుకుంది.

పూడిరాయి దొరువు పూడిక తీత... చేపల రేవు

వాకాడు మండలంలోని పూడిరాయి దొరువు వద్ద సముద్ర ముఖద్వారాల పూడికతీతకు రూ.97.09 కోట్లు మంజూరయ్యాయి. అదే చోట మోడెర్న్ ఇంటిగ్రేటెడ్ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (చేపల రేవు) నిర్మాణానికి రూ. 23.90 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. ఏపీ మ్యారిటైమ్ బోర్డు ద్వారా ఈ ఏడాదిలో వీటిని పూర్తి చేయాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో 1987 ఎకరాల ఆక్వా కల్చర్ సాగు విస్తీర్ణాన్ని ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. 20 వేల మంది మత్స్యకారులకు ఆదాయం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి మత్స్యకార సమృద్ధి యోజన కింద మత్స్యకారులకు బోట్లు, వలలు, ఇంజిన్లు కొనుగోలు చేసేందుకు 365 రుణ యూనిట్లు అమలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకుంది.

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణపై దృష్టి

గూడూరు- రేణిగుంట, ఏర్పేడు-పూడి రైల్వే లైన్ల కోసం 108 కిలోమీటర్ల మేరకు 135 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభించి వచ్చే ఏడాది మార్చిలోగా 20శాతం పనులు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుంది.దీర్ఘకాలిక పెండింగ్‌లో వున్న రేణిగుంట బైపాస్, ఎల్‌సీ36, ఎల్‌సీ 95లను ఈ ఏడాది పూర్తి చేయాలని నిర్ణయించింది.దీనివల్ల రేణిగుంట మీదుగా రైలు ప్రయాణాలకు సమయం తగ్గనుంది.

అయోధ్య తరహాలో తిరుపతి అభివృద్ధి కావాలి

- కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు

'అయోధ్యలో ఇళ్లు నిర్మించుకుని స్థిరపడేందుకు దేశవ్యాప్తంగా పలువురు సిద్ధపడుతున్నారు. అదే తరహాలో తిరుపతిలో స్థిరపడేందుకు ప్రజలు తొలి ప్రాధాన్యతతో ఎంచుకునేలా తీర్చిదిద్దాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి' అని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో ఆయన జిల్లా అభివృద్ధిపై సమీక్షించారు. జాతీయ రహదారులు, పోర్టులు, విమానాశ్రయం, శ్రీసిటీ వంటి పారిశ్రామికవాడ ఉన్న తిరుపతి గరిష్ఠంగా అభివృద్ధి చెందడానికి అవకాశమున్న నగరంగా సీఎం అభివర్ణించారు. దేశ నలుమూలల నుంచీ వచ్చే యాత్రికులు బస చేయడానికి అనువుగా కనీసం ఐదు వేల హోటల్ గదులు అందుబాటులో ఉండాలన్నారు.అనువైన భూములు, స్థలాలు గుర్తించి అందుబాటులోకి తెస్తే హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చే వారితో మాట్లాడదామన్నారు. తిరుపతిలో హోటళ్లు,కన్వెన్షన్ సెంటర్లు, మ్యారేజీ హాళ్లు గణనీయంగా నిర్మాణం కావాలన్నారు. ఎక్కడెక్కడి నుంచో తిరుపతి వచ్చి వివాహాలు చేసుకునేలా వెడ్డింగ్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. దానికోసం టీటీడీకి కూడా తగిన ఆదేశాలిస్తామన్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేపడతాం

డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు, రేణిగుంట మండలంలో బాలాజీ రిజర్వాయర్‌తో పాటు మల్లిమడుగు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపడతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పులికాట్‌లోకి సముద్ర నీరు సమృద్ధిగా వచ్చేలా వాకాడు మండలం పూడిరాయిదొరువు వద్ద సముద్ర ముఖద్వారాల పూడిత తీత పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కడప-రేణిగుంట, పీలేరు-కాలూరు జాతీయ రహదారుల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. నాలుగో జోన్‌లో ఉన్న తిరుపతి జిల్లాలో వృద్ధి రేటు 12.08 శాతం నమోదు కావడంపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. దాన్ని 15 శాతానికి పెంచాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జోన్ పరిధిలో తలసరి ఆదాయంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందంటూ అభినందించారు.

ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపులో చోరీ

- తిరుపతి మహిళ అరెస్టు
- రూ.98.50 వేల నగదు స్వాధీనం



శ్రీకాళహస్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపులో ఓ మహిళ రూ.98.50 వేలను చోరీచేసి పట్టుబడింది. ఈ దఫా మహాశివరాత్రి ఉత్సవాలు జరగడంతో నగదు అధికంగా ఉండటంతో గురుదక్షిణామూర్తి సన్నిధిలో జరగాల్సిన హుండీ లెక్కింపును అధికారులు అదనపు రూ.500 రాహుకేతు పూజామండపంలోకి మార్చారు. భ్రమరాంబిక సేవా సమితి ద్వారా కొందరు సేవకులను హుండీ లెక్కింపునకు నియమించారు. మధ్యాహ్నం భోజన విరామం కోసం కొందరు వెలుపలకు వెళ్తుండగా ఆలయ భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. తిరుపతికి చెందిన లావణ్య తాను షుగర్ పేషెంట్‌నని, డైపర్ తప్పక ధరించాలని చెప్పి ఉదయం హుండీ లెక్కింపునకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామానికి వెళ్లే సమయంలో జరిపిన తనిఖీల్లో ఆమె డైపర్‌లో నగదు దాచినట్లు గుర్తించారు. వెంటనే శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. రూ.98,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రికార్డుస్థాయిలో రూ.2.58కోట్ల హుండీ ఆదాయం

శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రికార్డుస్థాయిలో నమోదైంది. గతేడాది శివరాత్రి సమయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.2.16కోట్లు చేకూరింది. ఈ ఏడాది రూ.2.58 కోట్లతో సరికొత్త రికార్డు నమోదైంది. బుధవారం జరిపిన హుండీ లెక్కింపులో రూ.2,58,89,511 వచ్చింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 132 గ్రాములు, వెండి 714.300 కిలోలు, విదేశీ కరెన్సీ 193 వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధించిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్ల సస్పెన్షన్

తిరుపతి(వైద్యం), మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్యకళాశాల పరిధిలోని రుయాస్పత్రిలో పారా మెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ బుధవారం సస్పెండు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటప్రసాద్, రాజశేఖర్‌నాయక్ కొద్ది రోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ల్యాబ్‌లోని కొందరు పారా మెడికల్ విద్యార్థినులు వారం కిందట ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు వారం రోజులుగా విచారించి.. బుధవారం నివేదిక అందించింది. ఈ మేరకు ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటప్రసాద్, రాజశేఖర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (గురువారం సాయంత్రం)
సహర్: 4:52 (శుక్రవారం ఉదయం)

ముత్యాలమ్మా.. కాపాడమ్మా!

- తూర్పుకనుపూరులో జాతర సందడి
- కొలువైన పోలేరమ్మ



పుష్పాలంకారంలో దర్శనమిచ్చిన ముత్యాలమ్మ



పోలేరమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు



కొలువైన పోలేరమ్మ తల్లి

చిల్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'కోర్కెలు తీర్చే కల్పవల్లి.. కరుణించి కాపాడమ్మా' అంటూ ముత్యాలమ్మను భక్తులు వేడుకున్నారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో అమ్మవారి జాతర సందర్భంగా రెండో రోజైన బుధవారం భక్తుల రద్దీ మరింత పెరిగింది. జాతరలో భాగంగా పోలేరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి ముత్యాలమ్మ ఆలయానికి తూర్పు దిశలో ఏర్పాటుచేసిన తాత్కాలిక గుడిసెలో ప్రతిష్ఠించారు. పోలేరమ్మ మట్టి ప్రతిమతో పాటు సత్తి పోలేరమ్మ, అంకమ్మ, సిద్ధయ్య, పరుశురాముడు విగ్రహాలను ఊరేగించారు. పోలేరమ్మను, ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచీ భక్తులు తరలి వచ్చారు. అమ్మవారు (ఆటలమ్మ) పోసిన భక్తులంతా మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో రద్దీ నెలకొంది. నెత్తిమీద పెట్టుకున్న వేయికండ్ల కుండ, అందులో గండ దీపం, మొలకు వేపచీర, పడిగళ్లు, నవధాన్యాలు, ఎర్రగడ్డలు, కోడిపిల్లలను గుడి పైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం యార, శీగురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గొల్లల వేడుకల్లో భాగంగా గంగపెట్టె, వీరతాళ్లతో వీధులలో తిరిగారు. పెద్ద గొల్ల చిందులు, గణాచారి నాట్యం సందడి చేశాయి. రాత్రి అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. మూడో రోజైన గురువారం భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.



యార, గురునాధస్వామి, అంకమ్మల గ్రామోత్సవం - ముత్యాలమ్మ ఆలయం ఎదుట త్రిశూలం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఎంపీపీ, రెండు ఉపసర్పంచి స్థానాలకు నేడు ఎన్నికలు

వార్డు సభ్యుల మృతితో మరో రెండు చోట్ల ఉపసర్పంచి ఎన్నిక వాయిదా

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన తిరుపతి రూరల్ ఎంపీపీతో పాటు నాలుగు ఉప సర్పంచి స్థానాలకు వారం క్రితం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, గురువారం తిరుపతి రూరల్ ఎంపీపీ.. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, ఎర్రావారిపాళెం మండలం చింతగుంటలో మాత్రమే పరోక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణతో మొదలై మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రమాణస్వీకారంతో ముగియనుంది. ఇక, రేణిగుంట మండలం గురవరాజుపల్లి, కోట మండలం ఎన్‌పీ కొత్తపాళెంలో వార్డు సభ్యుల మృతితో ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు డీపీవో సుశీలాదేవి తెలిపారు.



ఎన్నిక జరిగే ప్రాంతంలో పరిశీలిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ, ఎంపీడీవో తదితరులు

తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు

తిరుపతిరూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఎంపీపీని ఎన్నుకోవాల్సి ఉంది. కోరమ్ ఉంటే సమావేశాన్ని ప్రారంభిస్తామని.. లేదంటే వాయిదావేసి శుక్రవారం ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి జుబేదా చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంఎల్‌ఏ, ఎంపీ, ఎమ్మెల్సీ హాజరు కావచ్చన్నారు. బుధవారం ఉదయం ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల నిఘాలో.. పోలీసుల బందోబస్తు నడుమ సజావుగా ఎన్నిక నిర్వహిస్తామన్నారు. పరిసరప్రాంతాల్లో 163వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నిక జరిగే ప్రదేశాలను ఏఎస్పీ రవి మనోహరాచారి, రూరల్ డీఎస్పీ శ్రీలత పరిశీలించారు. కాగా, 37 మంది ఎంపీటీసీ సభ్యుల్లో అప్పట్లో 36మంది వైసీపీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెరుమాళ్లపల్లె-2లో మాత్రం తేజస్వి ఇండిపెండెంట్‌గా ఎన్నికయ్యారు. విజయానికి 19మంది సభ్యుల మద్దతు అవసరం. ఈనెల20న తిరుపతి నుంచి ముంబై క్యాంప్ వెళ్లిన 32మంది ఎంపీటీసీ సభ్యులు గురువారం ఉదయానికి తిరుపతి చేరుకుని ఓటింగ్‌లో పాల్గొంటారని ఆపార్టీ నేతలు చెబుతున్నారు.




చోటా కె నాయుడు, వశిష్ట - జస్టిస్ శివసుబ్రహ్మణ్యం

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీ దర్శకుడు వశిష్ట, సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు, నటి దివి, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దివి

ఎస్వీయూ బాల్ బాడ్మింటన్ మహిళా జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), మార్చి 26(ఆంధ్రజ్యోతి) : కేరళ కారైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో ఈ నెల 29న జరగనున్న ఆలిండియా బాల్ బాడ్మింటన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ మహిళా జట్టు ఎంపికైంది. బుధవారం ఎస్వీయూ వ్యాయామ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. టోర్నమెంటులో రాణించాలని ఆకాంక్షించారు. టీం కోచ్‌గా డాక్టర్ డి.రెడ్డిభాస్కర్, మేనేజర్‌గా ఎ.నరసింహారావు వ్యవహరించనున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి ఉన్నాయి. క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,252

తలనీలాలు సమర్పించినవారు: 25,943



తిరుపతి శ్రీ కోదండరామాలయం

రాములోరి వేడుకలకు రారండోయ్..

- నేటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతిలోని కోదండ రామాలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 4వరకూ జరిగే ఈ వేడుకల నిర్వహణకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు చలువ పందిళ్లు వేశారు. ఆలయం, మాడ వీధులకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు కోదండరామయ్య వాహనాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ప్రాచీనమైన తిరుపతి కోదండరామాలయం విశేషాలు..

-తిరుపతి(టీటీడీ), ఆంధ్రజ్యోతి

ప్రాచీన కాలం నాటిది కోదండరామాలయం. విశేష చరిత్ర ఉన్న ఈ ఆలయం తొలినాళ్లలో తిరుపతికి ఉత్తరాన ఉండేది. ఊరు విస్తరించడంతో ప్రస్తుతం నగరం మధ్యన దర్శనమిస్తోంది. ఆలయానికి సంబంధించి అచ్యుతరాయల కాలంలో కుమార రామానుజ అయ్యంగార్ వేయించిన శాసనమొకటి లభించింది. క్రీ.శ.1480లో సాళువ నరసింహుడి కాలంలో శఠగోపదాసర్ నరసింహాచార్య మొదలియార్ కోదండ రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్లు శాసనం ద్వారా తెలుస్తుంది. అంతకుముందే ఆలయంలో స్వామి విగ్రహాన్ని జాంబవంతుల వారు ప్రతిష్ఠించారనేది ఐతిహ్యం. రామచంద్ర పుష్కరిణి ఉన్న ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు లభించడంతో జనమేజయ చక్రవర్తి ఆలయంలో తరువాత కాలంలో పునరుద్ధరించారని టీటీడీ పలు పుస్తకాల్లో ముద్రించింది.

తిరుమలను తలపించేలా..

తిరుమలకు, రామచంద్రమూర్తికి అనుబంధముందని ఇతిహాసం చెబుతుంది. రామచంద్రుడు సీతాన్వేషణ సఫలమవ్వడం కోసం స్వామి పుష్కరిణిలో స్నానమాచరించినట్లు, అందుకు గుర్తుగా తిరుమల ఆలయంలో సీతారాముల విగ్రహాలు ఉన్నాయని భవిష్యోత్తర పురాణంలో ప్రస్తావన ఉంది. తిరుమల ఆలయంలోని విగ్రహాలకు జడధారులు ఉండడం గమనించవచ్చు. శ్రీరాముల వారు, ఎక్కడ లేని విధంగా కుడి వైపున సీతాదేవి,ఎడమ వైపున లక్ష్మణ విగ్రహాలు ఉంటాయి. తిరుమల తరహాలోనే కోదండరామాలయంలో స్వామి, అమ్మవార్లు అర్చనామూర్తులుగా దర్శనమిస్తారు. వైకుంఠ ద్వారాల మాదిరిగానే సువర్ణమయమైన గర్భగుడి ముందు జయవిజయులు ద్వారపాలకులుగా కనిపిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు

తేదీ	ఉదయం	రాత్రి
27.03.2025	ధ్వజారోహణం (ఉదయం 9.15 నుంచి 9.30 వరకు)	పెద్దశేష వాహనం
28.03.2025	చిన్నశేష వాహనం	హంస వాహనం
29.03.2025	సింహ వాహనం	ముత్యపుపందిరి వాహనం
30.03.2025	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
31.03.2025	పల్లకి ఉత్సవం	గరుడ వాహనం
01.04.2025	హనుమంత వాహనం	గజ వాహనం
02.04.2025	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
03.04.2025	రథోత్సవం	అశ్వవాహనం
04.04.2025	చక్రస్నానం	ధ్వజావరోహణం

టీటీడీ పర్యవేక్షణ

తొలినాళ్ల నుంచి కోదండ రామాలయం స్వతంత్రంగా లేదు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉండేది. ఆ ఆలయ అధికారులే దీనిని పర్యవేక్షించేవారు. విజయనగర సామ్రాజ్యంలోని ఉదయగిరి నుంచి వేద పండితులు అర్చకులుగా పనిచేసేవారు. వారి కుటుంబాలకు ఆలయం సమీపంలోనే నివాసవసతి ఉండేది. సువిశాల రాతి గోడలతో, ప్రశాంత వాతావరణంలో ఉండేది. గుడి లోపలి వరుసలో చక్కటి ఉద్యానవనం ఉంది. ఊంజల మండపం, యాగశాల, పోటు వంటివి ఆలయంలోనే నిర్మించారు. ఎత్తయిన రాజగోపురానికి నేరుగా సన్నిధి వీధి చివర దీపస్తంభముండేది. మహంతుల తర్వాత టీటీడీ ఆలయ బాధ్యతలను చేపట్టింది.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన వాహనాలు




రంగులు అద్దుతున్న కళాకారులు

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించండి



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి(టీటీడీ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి డిమాండ్ చేశారు. అన్నమయ్య వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమయ్య చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు సంకీర్తనలు ఆలపించారు. అనంతరం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, నారాయణ, మహేష్, రజని తదితరులు పాల్గొన్నారు.



సెటిల్‌మెంట్లు.. భూదందాల్లో 'హెడ్'!

- ఎనిమిదేళ్లుగా ఒకే స్టేషన్‌లో తిష్ట

తిరుపతి(నేరవిభాగం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను బట్టి సెటిల్‌మెంట్లు.. భూదందాలు చేయడంలో ఆయన 'హెడ్' అంట. తిరుపతి సమీపం.. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ఓ పోలీసు స్టేషన్‌లో ఎనిమిదేళ్లుగా తిష్ఠవేసిన ఆయనపై తీవ్ర విమర్శలున్నాయి. గత ఐదేళ్ల ఆయన మాటే వేదంగా నడిచింది. అధికారులు సైతం అతడికి అడ్డం చెప్పలేని పరిస్థితులు ఉండేవంటారు. ఎవరైనా అధికారులు ఇతడి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తే.. తన పలుకుబడితో వారిపైనే చర్యలు తీసుకునేట్లు చేస్తాడని అంటారు. గతంలో అదే పోలీసు స్టేషన్ నుంచి ఒక అధికారిని ఇతడు బదిలీ చేయించాడంటూ పోలీసు వర్గాలు ఉదాహరణగా చెబుతాయి. ఇక, గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాకు ఈయన రూట్ అధికారిగా వ్యవహరించాడనే ఆరోపణలున్నాయి. అప్పటి ప్రజాప్రతినిధి చెప్పినట్లు చేస్తూ.. మట్టి, ఇసుక అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించేవాడని, అలా రూ.కోట్లు వెనకేసుకున్నట్లు విమర్శలున్నాయి. అక్కడ కానిస్టేబుల్ స్థాయిలో రైటర్‌ను నియమించి తెరవెనుక చక్రం తిప్పుతున్నాడని పోలీసులు చెబుతున్నారు. దీంతో ప్రతి ఫిర్యాదుదారు ఈయన్ను కలవాల్సిందేనట. ఈయన చెప్పినట్లు వింటే ఎఫ్ఐఆర్ అవుతుందట. ఎందుకంటే రైటర్ ఉన్నా.. కేసులు నమోదు చేసేది ఈయనేనని అక్కడి పోలీసులు చెబుతున్నారు. ఇక, ఓ దాబాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డే లేకుండా పోవడం వెనుక ఈయన ప్రమేయం ఉందన్న ఆరోపణలున్నాయి. ఓ భూతగాదాకు సంబంధించి కేసు రెఫర్ (కేసు లేకుండా చేయడం) చేస్తానని 'ఒప్పందం' కుదుర్చుకొని రెండేళ్లయినా చేయలేదంటారు. తన డబ్బు ఇచ్చేయమని ఆ కేసులో నిందితుడు అడగ్గా.. బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు ఫైలును ఉన్నతాధికారులకు పంపకుండా చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇలా ఇతడిపై ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కూటమి అధికారంలోకి వచ్చినా ఆయన దందా మాత్రం యథేచ్ఛగా సాగిపోతోందట. ఇన్ని ఆరోపణలున్న ఇతడు ఎనిమిదేళ్లుగా ఇదే స్టేషన్‌లోనే ఎందుకు ఉన్నారంటూ ఓ ఉన్నతాధికారి ఇటీవల ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఇక్కడ పని తెలిసిన వారు ఎవరూ లేరు సార్. ఎఫ్ఐఆర్ అయినా ఆయనొక్కడే రాయగలడు. కేసులు కట్టగలడు' అంటూ అక్కడి అధికారి వత్తాసు పలికినట్లు విశ్వసనీయ సమాచారం.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఎనిమిదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అవినీతి ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకుంటాం. దీనిపై ఎస్పీకి నివేదిక సమర్పిస్తా. భూతగాదా విషయం నా దృష్టికి వస్తే ఆ ఫైలు పంపాలని ఎస్ఐని ఆదేశించా.

- శ్రీనివాసరావు, రేణిగుంట డీఎస్పీ



టెక్నాలజీ గురు చంద్రబాబు!

- విజ్ఞానాన్ని విధ్వంసానికి వాడొద్దు
- దేశ ప్రగతికి తోడ్పాటునివ్వండి
- విద్యార్థులకు భువనేశ్వరి దిశానిర్దేశం

కుప్పం/గుడుపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుగారు విజ్ఞానంతో కూడిన అభివృద్ధిని ఆకాంక్షిస్తారు. అందుకోసమే పరిశ్రమిస్తారు. టెక్నాలజీ రెండువైపులా పదునున్న కత్తివంటిది. దాన్ని విధ్వంసానికి వాడొద్దు. టెక్నాలజీతో దేశ ప్రగతికి తోడ్పడండి.' అని భువనేశ్వరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు అందరికీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. అయితే ఆ టెక్నాలజీ వినియోగం గాడితప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికాసానికి, తద్వారా దేశ ప్రగతికి టెక్నాలజీని వినియోగించుకోవాలని, విధ్వంసానికి దాన్ని వాడొద్దని విద్యార్థులను హెచ్చరించారు. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులోకి వస్తున్న విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటున్న చంద్రబాబు, తద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి, సామాజిక, ఆర్థిక పరిపుష్టికి వినియోగపడేలా ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని ఆయన కోరుకుంటారన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతవరకు వాడుకోవాలో, ఈమేరకు వాటినుంచి లబ్ధిపొంది, అనవసరమైనదానికి దూరంగా ఉంచాలో ఎవరికివారు తెలుసుకోవాలన్నారు.

టెక్నాలజీ వాడకం దేవాన్ష్‌కు తెలుసు

టెక్నాలజీని ఎంతమేరకు వినియోగించుకోవాలో, ఎప్పుడు దూరంగా ఉంచాలో తన మనవడు దేవాన్ష్‌కు తెలుసని భువనేశ్వరి చెప్పారు. అధిక సమయం స్క్రీన్ చూడడంవల్ల చదువుపైన శ్రద్ధ తగ్గి, విద్యార్థుల దృష్టి ఇతరత్రా అనవసరమైన విషయాలపైకి మళ్లుతుందని చివరికి జీవితం గాడి తప్పుతుందని హెచ్చరించారు. 'దేవాన్ష్ ఫోన్లు, ఇతర గాడ్జెట్లు పరిమితంగా మాత్రమే వాడతాడు. అధిక సమయం స్క్రీన్ ముందు గడపడు. ఓ తల్లిగా చెబుతున్నా, టెక్నాలజీని వికాసానికి మాత్రమే వాడండి' అని భువనేశ్వరి విద్యార్థులకు హితవు పలికారు. గుడుపల్లె మండలంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు 1999లో 172 ఎకరాలు కేటాయించడం ద్వారా సాధిస్తున్న మంచి ఫలితాలు ఇప్పుడు చూస్తున్నామన్నారు. ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మాత్రం 53వ స్థానంలో ఉండడం విచారకమైన విషయమని చెప్పారు. అయితే 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటెంట్లు పొందడంలో భారత్ 6వ స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. విజ్ఞాన రంగంలో పరిశోధనకు ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. సైంటిఫిక్ టెంపర్ పెంచే విషయంలో విద్యార్థులకు తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని భువనేశ్వరి హామీ ఇచ్చారు.



అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులతో భువనేశ్వరి

- చంద్రబాబు కుటుంబ సభ్యులు మీరే

'ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిజమైన కుటుంబ సభ్యులంటే మీరే. మీకోసమే ఆయన తెల్లవారుజాము లేచింది మొదలు, రాత్రి 12గంటల దాకా విరామం లేకుండా పనిచేస్తారు.' అని భువనేశ్వరి అన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో భువనేశ్వరి మాట్లాడాక ఒక విద్యార్థిని పైకి లేచి చంద్రబాబు దినచర్య గురించి చెబితే తాము స్ఫూర్తి పొందుతామని అడిగారు. దానికి ఆమె సమాధానమిస్తూ ఏపీని నెంబర్ వన్ స్టేట్ చేయాలన్న తపనతో చంద్రబాబు పనిచేస్తున్నారని చెప్పారు. 'చంద్రబాబుగారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఒక్కోసారి ఆయన రాత్రి ఒంటి గంటదాకా పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే లేచి యోగా, ధ్యానం చేస్తారు.' అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనే ఆయన ధ్యేయమన్నారు. తనకు మొదట్లో రాజకీయాల గురించి పట్టేది కాదన్నారు. హెరిటేజ్ వ్యవహారాలతోపాటు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు నిర్వహణ నా బాధ్యతలు. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్నారని, వారిని చూస్తుంటే తనకు గర్వంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదువులపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగొచ్చని విద్యార్థులకు భువనేశ్వరి ఉద్బోధించారు.

- అమ్మానాన్నలే స్ఫూర్తి

ఎవరికైనా అమ్మానాన్నలే స్ఫూర్తి కావాలని భువనేశ్వరి అన్నారు. తనవరకు తల్లి దండ్రులే స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. 'నాన్నగారు చిన్న వయసులోనే ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి, తర్వాత స్కూలుకు వెళ్లేవారు. కుటుంబంకోసం ఆయన పడిన కష్టం చూస్తూ పెరిగినదాన్ని. మేము నిద్రపోయినప్పుడు వచ్చేవారు. మళ్లీ తెల్లారి లేచేటప్పటికి వెళ్లిపోయేవారు. అమ్మ మమ్మల్ని ఎంతో బాధ్యతగా పెంచింది. నాన్న కష్టం, అమ్మ బాధ్యత చూస్తూ పెరిగినవాళ్లం. మీరు కూడా బాధ్యతగా మెలగాలి.మీ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తేవాలి' అని భువనేశ్వరి విద్యార్థులకు ఉద్బోధించారు.అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, స్థానిక టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన సప్తగిరులు

తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో బుధవారం మలయప్పస్వామి ఊంజల్‌సేవలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానంతో సప్తగిరులు పులకించాయి. అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహభాషణం చేస్తూ అన్నమయ్యకు, వారి ఆచార్య పీఠమైన అహోబిలం మఠానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అహోబిలం నరసింహస్వామి అనుగ్రహంతో తాళ్లపాక అన్నమాచార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారన్నారు. ఈ మంత్రోపదేశంలో 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ముందుగా దినము ద్వాదశి, సప్తగిరి సంకీర్తనల గోష్టిగానంలో భాగంగా 'దినము ద్వాదశి నేడు', భావములోనా బాహ్యము, ఎంతమాత్రమునా ఎవ్వరు దలిచిన, పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, నారాయణతేనమో.., వంటి కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం దుంగల స్వాధీనం

మంగళం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాహనం సహా 10 ఎర్రచందనం దుంగలను జిల్లా అటవీశాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌కు అందిన రహస్య సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు బుధవారం తెల్లవారుజామున పంగూరు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపుగా టీఎన్ 31ఏకే 7299 నంబరు గల వాహనం వేగంగా వెళుతుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లిపోవడంతో అధికారులు వెంబడించారు. స్మగ్లర్లు దర్గిపేరి గ్రామానికి కొంతదూరంలో హైవేపై వాహనాన్ని వదలిపారిపోయారు. అధికారులు వాహనంలో తనిఖీ చేయగా పది ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనం సహా వాటి విలువ రూ.5లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఈ తనిఖీల్లో డీఆర్వో సికిందర్, ఎఫ్‌బీవోలు పురుషోత్తం, శోభారాణి, వాచర్లు పొన్నయ్య, జితేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్ర చందనంతో అటవీశాఖ అధికారులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రజాసమస్యలను పరిష్కరించండి



సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్యే బీద రవిచంద్ర

గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గపరిధిలోని ప్రజల సమస్యలను త్వరిగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచిం చారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలసి గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం తన కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్య లను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మ న్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషిచేస్తున్నారన్నారు. అనం తరం ఎమ్మెల్సీని, ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, బత్తిన ప్రణీత్, చరణ్ వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు చాటింపు



పోలేరమ్మకు కుంభంపోసి చాటింపు చేస్తున్న గ్రామపెద్దలు

నాయుడుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి: నాయుడుపేట గడియారం సెంటర్ వద్ద వెలసి ఉన్న గ్రామదేవత పోలేరమ్మ జాతరకు మొదటి చాటింపు వేశారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారి ప్రతిమను తయారుచేసి కుంభం పోసి గ్రామపెద్దల సమక్షంలో మొదటి చాటింపు వేశారు. మే 4న ఘట్టం, 6 తేదీ రాత్రి అమ్మవారి నిలుపు, 7న జాతర నిర్వహించి అదే రోజు రాత్రి అమ్మవారిని సాగనంపనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, గ్రామపెద్దలు నానాబాల సుబ్బారావు, నలబోతుల రామారావు, జీవీఆర్ నాయుడు, మస్తాన్, జల, గోపీ, శ్రీనివాసులు, భాస్కర్, కుబేరు మణి, దేవతా చెంచుకిషోర్, శేషం మునిమోహన్‌రావు, మహేష్‌రెడ్డి, యుగంధర్, గణపతి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ముస్లిం మహిళలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవా సంస్థ కార్యాల యంలో బుధవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పొనకా మల్లి కార్జున్‌రెడ్డి దాతృత్వంతో ముస్లిం మహిళలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్, ప్రభాకర్, రాము, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లమానుచేను విలేజ్ క్లినిక్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసులు

ఓజిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం చిల్లమానుచేను విలేజ్ క్లినిక్‌ను బుధవారం తిరుపతి జిల్లా డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసుల అధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. రోగులతో మాట్లాడి అక్కడ వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందికి అవ గాహన కల్పించారు. డీఎస్‌వో నాగేంద్రబాబు, డీపీవో ప్రకాష్, వైద్యాధికారులు వినీషా, మాధవ్, సీహెచ్‌వో చలపతి, హెల్త్ సూపర్‌వైజర్ క్రిష్ణవేణి వైద్య సిబ్బంది మస్తాన్, శ్రావణి, కల్పన, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, కన్నా వెంకట రమణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

తడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అక్కంపేటలో బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు పూర్తి సహకారం అందిస్తోంద న్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిల్లకూరు తేజారెడ్డి, జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, నాయకులు వాకి చర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ

వెంకటగిరిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ లోపు మొత్తం ఆస్తి పన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో పన్నుల బకాయిలను ఈ నెలాఖరు వరకు 50 శాతం వడ్డీ రాయితీతో ఒకేసారి చెల్లించవచ్చని కమిషనర్ చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

షార్ ఉద్యోగి భార్య ఆత్మహత్య

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):షార్ ఉద్యోగి భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈ ఘటన మంగళవారం సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. షార్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ డీఆర్‌డీఎల్‌లో క్వార్టర్స్ నెం: సీ2-112లో నివాసం ఉంటున్నాడు. విధి నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం షార్‌కు వెళ్లాడు. సాయంత్రం 7 గంటల సమయం లో ఇంటికి వచ్చేసరికి భార్య రాధిక (31) ఉరేసుకొని మృతి చెంది వుంది. వెంటనే ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు కాలనీకి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కాగా రాధిక కొద్దిరోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపతున్నట్లు తెలిసింది. మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలికి పాప, బాబు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌కేఆర్ కళాశాలలో రేపు జాబ్‌మేళా

గూడూరు అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ బుధవారం తెలిపారు. నిరుద్యోగయువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలియజేశారు.

ఫిజియోథెరపీపై అవగాహన ఉండాలి

బాలాయపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) ఫిజియోథెరపీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో మండలంలోని సచివాలయాల సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు ఫిజియోథెరపీపై 'నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ప్రతినిదులు సతీష్‌కుమార్, ఈవోపీఆర్డీ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన రవికుమార్ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం వారు ఆలయంలో సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీకి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు బైరి పార్థసారధి రెడ్డి, పొన్నా కాటయ్య, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దండి



విద్యార్థుల నైపుణ్యతను తెలుసుకొంటున్న ఎంఈవో జగదీష్‌బాబు

డక్కిలి, మార్చి 26 : (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను విద్యార్థి దశ నుంచే ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో జగదీష్‌బాబు తెలియజేశారు. బుధవారం ఆయన మండలంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించాల న్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం పెంచలయ్య, ఉపాధ్యాయులు తేజోవర్మ ఉన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

● తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు శెట్టిగుంట, ఆర్లపాడు, ఊడిపూడి, బంగారంపేట, పెళ్లకూరు, జీలపాటూరు, కానూరు, పెన్నేపల్లి, తాళ్వాయిపాడు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. ఆ గ్రామాల్లో జరిగిన రీసర్వే సమస్య లపై గ్రామ సభలు నిర్వహించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయడంతో పాటు పరిష్కరిస్తున్నామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వాకాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రత దృష్ట్యా మండల పరిషత్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర రావు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

'అధికార దుర్వినియోగం చేస్తున్న కూటమి నాయకులు'

వెంకటగిరిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూటమిలోని నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇసుక, గ్రావెల్, సైదాపురం క్వార్ట్జ్ అక్రమంగా తరలిపోతోందని ఆరోపించారు. వెంకటగిరి వైసీపీ కౌన్సిలర్లు ఏకతాటిపై ఉన్నారని మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే టీడీపీ అభాసు పాలవుతుందని ఆయన పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖను
వేధిస్తున్న వేసవి భయం

సిబ్బంది కొరతతో ఆందోళన ● అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు ● గత ఏడాదిలో 61 అగ్నిప్రమాదాలు ● ఉన్నవారితోనే సేవలు





అగ్నిమాపకశాఖ కార్యాలయం, మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది (ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో కొంతకాలంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. గూడూరులో 2010వ సంవత్సరంలో అగ్నిమాపకశాఖ నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించారు. రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవల శాఖగా ఈ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ పలు ప్రమాదాలను నివారిస్తుంటారు. గూడూరు కార్యాలయంలో ఒక ఫైర్ ఇంజిన్ వాహనంతో పాటు ఒక జీపు అందుబాటులో ఉంటుంది. గూడూరు సమీప ప్రాంతాలతో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, బాలాయపల్లి తదితర ప్రాంతాలలో జరిగే అగ్నిప్రమాదాలను నివారించడం ఇక్కడి సిబ్బంది విధి. ప్రధానంగా వేసవికాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. అయితే గూడూరులోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో తగిన సిబ్బంది కొరత కారణంగా ఉన్న సిబ్బంది అవస్థలు పడాల్సివస్తోంది. ఫైర్‌ఇంజన్ ఉండే ప్రాంతంలో శ్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది.

ఎంత మంది ఉండాలి..ఎందరు ఉన్నారు.?

ప్రధానంగా ఈ కార్యాలయంలో ఒక అగ్నిమాపకశాఖ అధికారి, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు, ముగ్గురు డ్రైవర్లు, ఆపరేటర్లు, తొమ్మిదిమంది ఫైర్‌మ్యాన్‌లు మొత్తం 16 మంది ఉండాల్సి ఉంది. అయితే గతేడాది జూలై నుంచి ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారి ఉన్నారు. ఫైర్‌మ్యాన్లు నలుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఆరుగురు సిబ్బంది కొరత ఉంది. ఏదైనా భారీ అగ్నిప్రమాదాలను అదుపుచేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఏడాదిలో 61 ప్రమాదాలు

గతేడాది స్థానిక కుమ్మరవీధిలో ఓ ఫ్యాన్సీ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో గూడూరుతో పాటు, కోట, నాయుడుపేట అగ్నిమాపకసిబ్బంది ఒక రోజంతా కష్టపడి మంటలను అదుపుచేయాల్సి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు సుమారు 61 అగ్నిప్రమాదాలను సిబ్బంది అదుపు చేశారు. రానున్నది వేసవికాలం కావడంతో ప్రమాదాలను నియంత్రించేందుకు తగిన సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు. వేసవికాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసకోవాలని, ఏదైనా ప్రమాదాలు జరిగితే వెంటనే 08624-251899 నంబరును కానీ, 101 నంబరుకు కానీ సమాచారం అందించాలని సిబ్బంది తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యను పరిష్కరించేందుకు చొరవతీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, పచ్చవ మాధవనాయుడు, వేనాటి మురళి రెడ్డి, అలవల శ్రీనివాసులు, గురకల సుబ్రమణ్యం, కృష్ణయ్య, బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



వెంకన్నపాళెంలో నాయకులు, కార్యకర్తలకు గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్న మధుయాదవ్

కోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్తా ఇప్పటి నుంచే సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ పటిష్టత కోసం సైనికుల్లా పనిచేయాలని వెంకన్నపాళెం సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకులు మధుయాదవ్ కోరారు. మండల పరిధిలోని వెంకన్నపాళెంలో బుధవారం టీడీపీ సభ్యత్వాలు పొందిన కార్య కర్తలు, నాయకులకు పార్టీ గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. అదే విధంగా పోలింగ్ బూత్‌ల వారీగా బూత్‌కమిటీ అధ్యక్షులకు కొన్ని క్లస్టర్లకు సంబంధించిన గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. వాటిని సభ్యులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యరగల వీరయ్యయాదవ్, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

సుఖ సంతోషాలతో రంజాన్ జరుపుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, ముస్లిం మైనార్టీ నాయకులు

నాయుడుపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట నియోజక వర్గంలో ముస్లింలు సుఖసంతోషాలతో రంజాన్ పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం రాత్రి టీడీపీ యువనాయకులు నెలవల రాజేష్ ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. టీడీపీ నాయకులు రఫీ, నానాబాల సుబ్బారావు, పార్థసారధి, ముస్లింలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు బస్సుల కొరత



ఆర్టీసీ బస్టాండు వద్ద భక్తులు బస్సుకోసం పాట్లు

సూళ్లూరుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా కనుపూరు ముత్యాలమ్మ జాతరకు సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపడం ఆనవాయితీ. జాతరకు వారం రోజుల ముందే ఎక్కడెక్కడ నుంచి బస్సులు నడపాలనే విషయంపై ఆర్టీసీ అధికారులు ముందస్తుగానే ప్రకటిస్తుంటారు. ఒకవేళ ఇక్కడి డిపోలో సరిపడా బస్సులు లేకపోయినా పక్కడిపోల నుంచి రప్పించి నడిపేవారు. ఈసారి అలాంటి చర్యలేవి తీసుకోలేదు. డిపో అధికారుల నిర్లక్ష్యంతో కనుపూరు జాతరకు వెళ్లేందుకు బస్సులు లేక భక్తులకు అవస్థలు తప్పలేదు. మంగళవారం నుంచి ప్రత్యేక సర్వీసులు నడపాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నం నుంచి 5 ప్రత్యేక సర్వీసులను మాత్రమే నడిపారు. అవి చాలకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కోటలో అంబలి చలివేంద్రాలు

కోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్, కోట ప్రాంతాలలో బుధవారం భక్తులకు అంబలి చలివేంద్రాలు ప్రారంభమయ్యాయి. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆయా ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు భక్తుల సౌకర్యార్థం కోసం అంబలి చలివేంద్రాలను ఏర్పాటు చేశాయి. పలు ప్రాంతాల నుంచి కోట మీదుగా తూర్పు కనుపూరుకు వెళ్లే భక్తులు అంబలి తాగి సేదతీరారు. జాతరను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో అమ్మణ్ణికి భక్తులు పొంగళ్లు పెట్టారు.

ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

కోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహన దారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని విశ్వనాథపురం అగ్రహారం గ్రామానికి చెందిన గాలి విమలాకర్‌రెడ్డి బుధవారం ద్విచక్ర వాహనంలో సిద్ధవరం నుంచి కోట వైపు వెళ్తున్నాడు. సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కనుపూరు ముత్యాలమ్మ జాతరకు వస్తోంది. ఈ రెండు వాహనాలు కొక్కుపాడు క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదవశాత్తూ ఎదురె దురుగా ఢీకొన్నాయి. ఈ సంఘ టనలో సుధాకర్‌రెడ్డి కాలు విరిగిపోయింది. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ బీదాకు సన్మానం

నాయుడుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రెండోసారి ఎమ్మెల్సీగా నియమితులైన తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్రను నాయుడుపేట టీడీపీ నాయకులు సన్మానించారు. నెల్లూరులోని ఎమ్మెల్సీ బీదా కార్యాలయంలో బుధవారం ఆయనను నాయుడుపేట టీడీపీ నాయకులు శ్రీరాం ప్రసాద్ శాలువా కప్పి సన్మానించారు. సన్మానించిన వారిలో అవధానం సుధీర్, సూరీ, సత్యం తదితరులు ఉన్నారు.

కిక్కిరిసిన తూర్పు కనుపూరు



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బీద రవించద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు



యార, గురునాథస్వామి, అంకమ్మల గ్రామోత్సవంలో వీరతాళ్లతో నృత్యం చేస్తున్న గొల్లలు



పోలేరమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



వేయికండ్ల కుండను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

చిల్లకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ జాతరలో రెండో రోజు భక్తుల రద్దీ మరింత పెరిగింది. పోలేరమ్మను, ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భక్తుల కోసం ఆలయ ఆవరణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు, అంబలి అందజేశారు. పలువురు అన్నదానాలు చేశారు. డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు చేపట్టారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్యే పాశం, ఎమ్మెల్సీ బీదా

ముత్యాలమ్మను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీలు దర్శించుకున్నారు. జాతరకు వచ్చిన వీరికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.